జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
NIZAMABAD EDITION

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు మరియు మండలం రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

నిజామాబాద్ బుధవారం 16 సెప్టెంబర్ 2026 సంపుటి : 16 సంచిక : 229 పేజీలు : 8 వెల : 1/- RNI No. TELTEL/2010/35558
శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయనం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి
Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు



నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.. నిమజ్జనాలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేయాలి

మండపాల వద్ద 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి.. సోషల్ మీడియాలో వదంతులను నమ్మవద్దు

ఇప్పటికే మూడు డీజేలపై కేసులు.. సామగ్రి, వాహనాలు స్వాధీనం

జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

# కూర్మ సంప్రదాయాన్ని చాటేలా గణేష్ ప్రతిష్ఠాపన

## భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ప్రత్యేక పూజలు

## కూర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)**

కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో కూర్మ సంఘం ఆధ్వర్యంలో గణేష్ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కూర్మ సంఘం సభ్యులు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, గణపతి నామస్మరణల మధ్య గణనాథుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సంప్రదాయబద్ధంగా

- మిగతా2లో



# పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

-- ఇంచార్జ్ మంత్రి సీతక్క .. ఎంపీ సురేష్ షెట్కర్

ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు ... ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

--జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్



చదువుకున్న బడికి తిరిగి వచ్చి జ్ఞాపకాల ఒడిలో మునిగిపోయిన షబ్బీర్ అలీ.తాను విద్యనభ్య సించిన పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించిన కామారెడ్డి ముద్దుబిడ్డ ఒక మనిషి జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా తనను తీర్చిదిద్దిన పాఠశాల జ్ఞాపకాలను మాత్రం ఎప్పటికీ మరచిపోలేడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తాను విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కళాకారుల ఉద్యోగాలపై కాలయాపన వద్దు

సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి


ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలి

సీఎం, డిప్యూటీ సీఎం, సాంస్కృతిక శాఖ మంత్రి వెంటనే రాష్ట్ర కమిటీతో చర్చలు జరపాలి

స్పందించకపోతే 33 జిల్లాల కళాకారులతో చలో రవీంద్రభారతి

తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం హెచ్చరిక






# జీవ జాతుల రక్షణ కవచం... ఓజోన్ !

--సెప్టెంబర్ 16 ప్రపంచ ఓజోన్ దినోత్సవం

-- జి. లక్ష్మీనారాయణ, సామాజిక రచయిత




**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)**

ప్రపంచవ్యాప్తంగా శాస్త్రసాంకేతిక రంగాలు విపరీతంగా పురోగమించాయి. అత్యాధునిక శీతలీకరణ యంత్రాలు, సౌకర్యవంతమైన విలాసాలు మానవ జీవితాన్ని సుఖమయం చేస్తున్నాయి. కానీ, అంతిమంగా ఈ భూగోళంపై ఉన్న ప్రతీ జీవి సురక్షితంగా మనుగడ సాగించడానికి ఆధారం కేవలం సాంకేతిక వసతులు కావు, అనాదిగా ప్రకృతి ప్రసాదించిన అద్భుత రక్షణ కవచం/ రక్షణ వలయమే ఓజోన్ పొర. సూర్యుని నుండి వెలువడే ప్రాణాంతక అతినీలలోహిత కిరణాలను పీల్చుకుని, భూమిపై ఉష్ణోగ్రతలను, జీవజాలాన్ని సమతుల్యంగా ఉంచుతున్న ఈ అదృశ్య వలయం నేడు మానవ తప్పిదాల వల్ల తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో ప్రతి ఏటా సెప్టెంబర్ 16న 'ప్రపంచ ఓజోన్ దినోత్సవం' వేళ ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం సేకరిస్తున్న ప్రపంచ స్పందన

- మిగతా2లో

# పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు






-- ఇంచార్జ్ మంత్రి సీతక్క
-- ఎంపీ సురేష్ షెట్కర్
-- ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు
-- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
--జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి)** చదువుకున్న బడికి తిరిగి వచ్చి జ్ఞాపకాల ఒడిలో మునిగిపోయిన షబ్బీర్ అలీ.తాను విద్యనభ్య సించిన పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించిన కామారెడ్డి ముద్దుబిడ్డ ఒక మనిషి జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా తనను తీర్చిదిద్దిన పాఠశాల జ్ఞాపకాలను మాత్రం ఎప్పటికీ మరచిపోలేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. తాను విద్యనభ్యసించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ,తాను 1971లోవిద్యనభ్య సించిన ఈ పాఠశాల తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉందన్నారు. "నేను చదువుకున్న బడి ఇది. ఈ పాఠశాల నాకు కేవలం ఒక విద్యాలయం కాదు... నా జీవితానికి పునాది వేసిన ప్రదేశం. ఇక్కడి నుంచే నా ప్రయాణం ప్రారంభమైంది. అందుకే ఈ బడికి ఏదో ఒక మంచి చేయాలనే తపన ఎప్పటి నుంచో ఉంది" అని ఆయన భావోద్వేగంగా అన్నారు. తాను ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, తనతో కలిసి చదువుకున్న మిత్రులను, ఆ పాఠశాల జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు.తాను చదువుకున్న పాఠశాలకు తిరిగి వచ్చి, అదే ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రస్తుత విద్యార్థులను కలుసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులను ఎన్నో సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో కలుసుకోవడం మరపురాని అనుభూతిగా అభివర్ణించారు.

**భవనం మారుతుంది...!**

కానీ ఈ బడి నాకు ఇచ్చిన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మారవు.ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి. వారు ఉన్నత స్థాయికి ఎదిగి, తమ పాఠశాలకు, తమ సమాజానికి తిరిగి 'సేవ చేయాలి" అని షబ్బీర్ అలీ ఆకాంక్షించారు. కామారెడ్డి బాయ్స్ స్కూల్ అభివృద్ధి అవసరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేకంగా కృషి చేశానని షబ్బీర్ అలీ తెలిపారు.పాత భవనాన్ని తొలగించి ఆధునిక ప్రమాణాలతో నూతన పాఠశాల భవనాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నేటి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించాలన్నదే లక్ష్యమన్నారు.ఆధునిక తరగతి గదులు, డిజిటల్ విద్యా సౌకర్యాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, విద్యార్థులకు అవసరమైన ఇతర మౌలిక వసతులతో పాఠశాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు పాఠశాల అభివృద్ధికి అవసరమైన చోట తన వంతుగా కూడా సహకరిస్తానని షబ్బీర్ అలీ స్పష్టం చేశారు.

**చదువు నేర్పిన బడికి...!**

మనం రుణపడి ఉంటాం. ఆ రుణాన్ని పూర్తిగా తీర్చలేకపోయినా మనకు చేతనైనంత మంచి చేయడం ప్రతి పూర్వ విద్యార్థి బాధ్యత" అని ఆయన అన్నారు.ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఒక వ్యక్తి తాను చదువుకున్న పాఠశాలను గుర్తు పెట్టుకుని, దాని అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కామారెడ్డి బాయ్స్ స్కూల్‌కు రూ.5 కోట్ల నిధులు తీసుకురావడంలో షబ్బీర్ అలీ ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని అన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన భవనం పూర్తయిన తర్వాత ఈ పాఠశాల మరింత మెరుగైన విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ,....!

తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి షబ్బీర్ అలీ చూపుతున్న శ్రద్ధ స్ఫూర్తిదాయకమన్నారు.పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించడమే కాకుండా, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనతో ముందుకు సాగడం అభినందనీయమన్నారు విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ...!

కామారెడ్డి బాయ్స్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగడం సంతోషకరమన్నారు. పాత భవనం స్థానంలో ఆధునిక వసతులతో కొత్త భవనం నిర్మాణం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి షబ్బీర్ అలీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ...!

కామారెడ్డి బాయ్స్ స్కూల్‌కు నూతన భవనం నిర్మించడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన, ఆధునిక విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారి కృషిని అభినందించారు.

'బడిని మరచిపోని బిడ్డ'..!

తాను చదువుకున్న పాఠశాలను మరచిపోకుండా, అదే పాఠశాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు తీసుకురావడంతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్న షబ్బీర్ అలీపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందనలు వ్యక్తం చేశారు.జీవితంలో ఎంత ఎదిగినా తనకు విద్యనందించిన పాఠశాలను గుర్తుంచుకుని, భవిష్యత్ తరాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఆలోచన "చదువు ఇచ్చిన బడికి రుణం తీర్చుకోవాలనే గొప్ప మనసుకు నిదర్శనం" అని పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు ఉల్లంఘన డీజే కేసు నమోదు

--వజ్జేపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా డీజే నిర్వహణ
--డీజే యజమాని, ఆపరేటర్ పై కేసు నమోదు
--డీజే వాహనం, ఇతర సామగ్రి సీజ్

**సదాశివనగర్, సెప్టెంబర్ 14 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వజ్జపల్లి గ్రామంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా డీజే నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్. చర్యలు చేపట్టారు. డీజే నిర్వహణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, పోలీస్ శాఖ సూచనలు మరియు నిబంధనలను ఇప్పటికే స్పష్టంగా తెలియజేసినప్పటికీవాటిని ఉల్లంఘిస్తూ వజ్జపల్లి గ్రామంలో దగడు యూత్ ఆధ్వర్యంలో డీజే నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో సంబంధిత నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా డీజే యజమాని మరియు ఆపరేటర్ పై కూడా కేసు నమోదు చేసి,డీజే కు సంబంధించిన వాహనం మరియు సామగ్రిని పోలీసులు సీజ్ చేశారు.

**సీజ్ చేసిన సామగ్రి**

ఐచర్ వాహనం టా12జు౬6901
1500వోల్టేజ్ బేస్1, 6హెచ్ ఎఫ్ టాప్ స్పీకర్ 1, ఆమ్లిఫైర్3,20 కె.వి జనరేటర్ 1, ట్రస్ట్ స్టాండ్ 1, మిక్సర్ 1, లెనోవో లాప్టాప్ 1 పట్టుబడ్డాయి.

**ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.**

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు మరియు పోలీస్ శాఖ సూచనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని సదాశివనగర్ పోలీసులు తెలిపారు. ప్రజల శాంతి, భద్రత మరియు ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు డీజే నిషేధ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. శాంతియుత వాతావరణం కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి అని ఎస్సై పుష్పరాజ్. తెలిపారు.



# బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు




**బీర్కూర్, ప్రజాజ్యోతి సెప్టెంబర్ 15:** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 41మంది పేషెంట్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో 13 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి బోధన్ లయన్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని లయన్స్ సభ్యులు సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ సీతాలె రమేష్, సీనియర్ లయన్స్ శ్రీనివాస్, లయన్స్ సభ్యులు మేరు భరత్, సతీష్ యాదవ్, సుధాకర్, శ్రీకాంత్ పటేల్, గురుదత్త శ్రీకాంత్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్ పై కేసు నమోదు చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకుల ఫిర్యాదు




**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -15(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండల ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్లో హమారా ప్రసాద్ పై తక్షణ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాడు ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమారా ప్రసాద్ అనే వ్యక్తి తరచుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణమన్నారు. అంతేకాక అంబేద్కర్ కల్పిత నాయకుడు అంటూ పుస్తకాన్ని రాస్తున్నట్లు సోషల్ మీడియాలో బహిరంగంగా చెప్పాడని, హమారా ప్రసాద్ చేస్తున్న ఈ చర్యల వెనుక కుట్ర దాగి ఉందని స్పష్టమవుతుందన్నారు. బిసి,ఎస్సీ ఎస్టీ, మైనార్టీ బహుజనుల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశాడని, అటువంటి గొప్ప నాయకుని కించపరుస్తూ మాట్లాడిన హమర ప్రసాద్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షులు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కనిరాం, సంఘ బాధ్యులు నౌషా, వినోద్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు సౌండ్ సిస్టం అందజేత

ఎన్నికల హామీలు ఒక్కొక్కటిగా అమలు
సిద్ధి శ్రీధర్ గుప్తకు కితాభిస్తున్న ప్రజలు



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -15(ప్రజా జ్యోతి )** ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ నాయకులు ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తారు. గెలుపే లక్ష్యంగా ఆచరణ సాధ్యం కానీ హామీలు కూడా గుప్పిస్తుంటారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వాటిలో కొన్నింటిని అమలు చేస్తారు. మరి ఇంటిని పక్కన పెడతారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలనే శిలాశాసనంగా భావిస్తూ గెలిచిన తర్వాత అమలు చేస్తూ ప్రజలందరితో శభాష్ అని కితాబ్ అందుకుంటున్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ సిద్ధి శ్రీధర్ గుప్తా. ఎన్నికల్లో ఎనిమిదో వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన సిద్ధి శ్రీధర్ గుప్త వినూత్నంగా ప్రచారం చేస్తూ తన సొంత మేనిఫెస్టో విడుదల చేసి ప్రజాభిమానం చురగొని భారీ మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల హామీ మేరకు ఎనిమిదో వార్డు పరిధిలో గూడెం గణేష్ మండలికి, కాంట్రపల్లి ఆధ్వర్యంలో గణేష్ మండలికి వేలాది రూపాయల విలువ గల ఆమ్లిఫైర్ సౌండ్ సిస్టంను అందజేస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన పది రోజుల్లోనే తన సొంత మేనిఫెస్టో అమలుచేసి ప్రజలతో మెప్పు పొందారు. వార్డు పరిధిలోని ఓటర్లకు ఆడకూతురు జన్మిస్తే రూ. 10వేలు ఆడ కూతురు వివాహానికి రూ. 11వేలు రూపాయలు, ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు రూ. 10 వేలు రూపాయలు, వార్డ్ ప్రజల కోసం బాడీ డిఫ్రిజిరేటర్, వార్డులో బోరుబావి తవ్వించి మోటార్ ఏర్పాటు చేస్తానని హామీలు ఇచ్చాడు. పైన పేర్కొన్న హామీలన్నీ ఇప్పటికే అమలు చేశారు. ఎన్నికల తర్వాత మొట్టమొదటిసారి వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో ఆ రెండు గణేష్ మండలాలకు ఆమ్లిఫైర్ సౌండ్ సిస్టం సైతం వేలాది రూపాలు ఖర్చు చేసి అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కే నేటి రాజకీయ నాయకుల కు విరుద్ధంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న సిద్ధి శ్రీధర్ గుప్తాను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. రాజకీయ నాయకులు శ్రీధర్ గుప్తాను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ

-- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్వార్టర్లీ తనిఖీ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో క్వార్టర్లీ తనిఖీలో భాగంగా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గోదాం భద్రతకు సంబంధించి అమలు చేస్తున్న ప్రమాణాలు, రికార్డుల నిర్వహణను కూడా సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎంల భద్రత, గోదాం నిర్వహణ విషయంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్. వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, ఎన్నికల సూపరింటెండెంట్ రాజేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పండగ పూట పేకాట జోరు పోలీసుల దాడితో బేజారు

--మూడు ముక్కలాట నలుగురు అరెస్ట్
--2,080 నగదు
--4 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



**సదాశివనగర్, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డబ్బులు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్. ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి సంతోష్ రెడ్డి. పౌల్ట్రీ ఫామ్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి రూ.2,080 నగదు, 4 మొబైల్ ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సదాశివనగర్ ఎస్సై పుష్ప రాజ్. మాట్లాడుతూ, జూదం చట్టరీత్యా నేరమని, ప్రజలు జూదానికి దూరంగా ఉండాలని సూచించారు. మీ పిల్లల బంగారు భవిష్యత్తుపై దృష్టి పెట్టండి. సమయం చాలా విలువైనది. జూదానికి సమయాన్ని కేటాయించకుండా, మీ పిల్లల భవిష్యత్తుకు పునాది వేయడానికి మీ సమయాన్ని కేటాయించండి అని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జూదానికి తావు లేదని, జూదానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన పాలకమండలి.

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అడిషనల్ కలెక్టర్ మరియు ఎన్నికల పరిశీలకులు ఎన్.వై. గిరి విడుదల చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 8న జిల్లా ఎన్నికల అధికారి నియామకం జరిగిందని, సెప్టెంబర్ 9 నుండి 14 వరకు ఓటర్ల ప్రాథమిక జాబితా ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించినట్లు తెలిపారు. సెప్టెంబర్ 15న ఓటర్ల సవరణల దరఖాస్తుల స్వీకరణ, సెప్టెంబర్ 16న రాష్ట్ర శాఖ ఆమోదానికి అప్పీళ్ల పంపకం పూర్తి చేసి, సెప్టెంబర్ 19న తుది ఓటర్ల జాబితాతో పాటు అధికారిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రచురిస్తారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 24న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు జరుగుతుంది. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి రూ. 10,000/- నాన్-రిఫండబుల్ డిపాజిట్ చెల్లించాలని, ప్రతీ నామినేషన్‌ను ఇద్దరు అర్హులైన సభ్యులు ప్రతిపాదించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన, సెప్టెంబర్ 26న ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 01:00 వరకు నామినేషన్ల ఉపసంహరణ సమయం ఉంటుంది. అదే రోజు (సెప్టెంబర్ 26) మధ్యాహ్నం 3:00 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను అధికారికంగా వెల్లడిస్తారు. అవసరమైతే అక్టోబర్ 4న ఉదయం 08:00 నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 04:00 గంటల నుండి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. లెక్కింపు పూర్తయిన వెంటనే నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ట్రెజరర్, మరియు స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడి ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి, అక్టోబర్ 5న సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర శాఖకు సమర్పిస్తారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమాచారం, సందేహాలు లేదా పూర్తి వివరాల కొరకు కామారెడ్డి కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 2 నందు నేరుగా సంప్రదించవచ్చని లేదా 9492555350 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# కూర్మ సంప్రదాయాన్ని చాటేలా గణేష్ ప్రతిష్ఠాపన

-మొదటిపేజీ తరువాయి
జరిగింది. ప్రతిష్ఠాపనకు ముందు గణనాథుడి విగ్రహాన్ని పూజా కార్యక్రమాలతో మండపానికి తీసుకువచ్చారు. అనంతరం పండితుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చనలు నిర్వహించారు. గణపతి హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి, గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని నిర్వాహకులు ప్రార్థించారు.

**సంప్రదాయబద్ధంగా ప్రతిష్ఠాపన**

కూర్మ సమాజానికి తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ గణేష్ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రత్యేకతగా నిలిచింది. ప్రతిష్ఠాపన సందర్భంగా కూర్మ సంఘం సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గణేష్ ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండపాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణగా మారింది. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. గణపతి నామస్మరణలతో ఇస్రోజీవాడి గ్రామం మార్మోగింది.

**భక్తి, ఐక్యతకు ప్రతీకగా వేడుకలు**

గణేష్ ఉత్సవాల ద్వారా గ్రామ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడుతుందని కూర్మ సంఘం సభ్యులు తెలిపారు. పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయాలను కేవలం కొనసాగించడం మాత్రమే కాకుండా, వాటి ప్రాధాన్యతను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. యువత సంప్రదాయాలను తెలుసుకుని భావితరాలకు అందించేలా ఇటువంటి సామూహిక కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు.

ప్రతిష్ఠాపన అనంతరం గణనాథుడిని డొల్లుల తాళాలు, సంప్రదాయ వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు, యువత ఉత్సాహంగా పాల్గొని గణపతి నామస్మరణలు చేస్తూ శోభాయాత్రను నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

సంఘం సభ్యుల పాల్గొనడం

ఈ కార్యక్రమంలో కూర్మ సంఘం అధ్యక్షుడు బుల్లె బలమళ్ళు, క్యాషియర్ ఎస్.పీ. మహిపాల్, సభ్యులు సీహెచ్. అశోక్, ప్రశాంత్, ప్రణీత్, పర్స మహిపాల్, చిన మహిపాల్, మహేష్, డిష్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. సంఘం సభ్యులు, యువత, గ్రామస్థుల సహకారంతో గణేష్ ప్రతిష్ఠాపన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

# పోసానిపేట్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

-- మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డా. సురేష్ మెడికల్ ఆఫీసర్ సూచనల మేరకు పోసానిపేట్ గ్రామపంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామంలోని జ్వరంతో బాధపడుతున్న రోగులను వైద్య సిబ్బంది పరీక్షించి, అవసరమైన వారికి మలేరియా మరియు డెంగ్యూ నిర్ధారణ కోసం రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే ప్రజలకు ఉచితంగా రక్తపోటు రక్తంలో షుగర్,పరీక్షలు నిర్వహించి, పరీక్షల ఆధారంగా అవసరమైన వైద్య సలహాలు అందించారు. శిబిరానికి వచ్చిన రోగులను వైద్య సిబ్బంది పరీక్షించి,వారి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, జ్వరాలు, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా చూడటం, దోమల వృద్ధిని అరికట్టడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, జ్వరం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని గర్భిణీ స్త్రీలందరికీ క్లినిక్ నిర్వహించి, గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన పరీక్షలు, పోషకాహారం, మందుల వినియోగం,గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ప్రసవానికి ముందు పాటించాల్సిన ఆరోగ్య సూచనలను ఆరోగ్య సిబ్బంది వివరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రభుత్వ వైద్య సిబ్బంది నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుద్దాల లింగం, ఉప సర్పంచ్ గంద్ర అంజయ్య, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు గంగాధర్, రాకేష్, రాజమని, రాజేందర్, పోచయ్య, సురేష్, వి డి సి చైర్మన్ గంగాధర్, డా. రమ్యశ్రీ, రాజమణి, మంజుల, పద్మ, ఫార్మసిస్ట్ శ్రీహరి, శ్రీధర్, ఆశ కార్యకర్తలు అమల, కళావతి, బాలలక్ష్మి, ప్రమీల, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లడ్డూల పంపిణీ

**ఇస్రోజీవాడిలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పంపిణీ**



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలోని వివిధ వినాయక మండపాలకు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి అందజేసిన లడ్డూలను మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పంపిణీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వినాయక మండపాలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లడ్డూలను బహూకరిస్తూ వస్తున్నారని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే అందజేసిన లడ్డూలను గ్రామంలోని వివిధ వినాయక మండపాలకు తీసుకెళ్లి భక్తులు, మండపాల నిర్వాహకులకు బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నాయకులు కోరారు. గ్రామంలో పండుగ సందర్భంగా ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక వాతావరణం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీజేపీ అధ్యక్షులు పర్సా మహిపాల్, బూత్ అధ్యక్షులు చెట్టుకూరి ప్రశాంత్, మల్లీ గంగయ్య, చెట్కూరి మహిపాల్, రవి వర్మ, రవి కుమార్, సుమన్, పోషయ్య, నగేష్, గోవింద్ రావు, కొకట్ల ప్రశాంత్, గండ్ల రాజు, చెట్కూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు. వినాయక మండపాలకు లడ్డూలను అందజేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏటా కొనసాగుతున్న ఈ సంప్రదాయం వినాయక ఉత్సవాల్లో భక్తులకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోందని వారు పేర్కొన్నారు.

# క్యాసంపల్లి తండాలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ**



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 15 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండా గ్రామానికి చెందిన భూక్య సరోజ, పిపావత్ లలితలకు కళ్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన రూ.1,00,116 (ఒక లక్షా నూట పదహారు రూపాయలు) విలువైన చెక్కులను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి తహసీల్దార్ హేమబిందు, జీపీఓ, గ్రామ సర్పంచ్ భూక్య శ్రీనివాస్తో పాటు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -15(ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డి పట్టణంలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమ ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని నిమజ్జన రూట్ తో పాటు నిమజ్జనం నిర్వహించే పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను ఆర్డీఓ ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాగ్జీవన్, ఎలక్ట్రికల్ ఏఈ, ఉత్సవ కమిటీ సభ్యులు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన రూట్ లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, పెద్ద చెరువు వద్ద క్రేన్లు, లైటింగ్, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ ప్రభాకర్ సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# కాలభైరవ స్వామి ఆలయంలో సింధూర పూజలు



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని ఈసన్నపల్లి రామారెడ్డి గ్రామాలలో కొలువై ఉన్న అతి పవిత్రమైన పుణ్యక్షేత్రం శ్రీ కాలభైరవ స్వామి ఆలయాన్ని మంగళవారం భక్తులు స్వామి వారికి ప్రత్యేక సింధూర పూజలు నిర్వహించారు. తదుపరి భక్తుల కొరకు ఆలయ సిబ్బంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రఘురాం చంద్రం గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ వంశీ శర్మ, ఆలయ సహాయకులు నాగరాజు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

# జీవ జాతుల రక్షణ కవచం... ఓజోన్ !

-మొదటిపేజీ తరువాయి
అత్యంత కీలకమైనది. సుస్థిర శీతలీకరణ దిశగా.. ఈ యేడు ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఇతివృత్తం(2026) ఏమంటే – "చల్లని గ్రహం కోసం ప్రపంచ కార్యాచరణ -- మాంట్రియల్ ప్రోటోకాల్ పరిధిలోని 'కిగాలీ' సవరణ ద్వారా సుస్థిర శీతలీకరణ పదేళ్ల ఉత్సవం". మాంట్రియల్ ఒప్పందానికి తెచ్చిన చారిత్రక 'కిగాలీ సవరణ' పదేళ్లు పూర్తి చేసుకున్నది. ఈ సందర్భంగా, పర్యావరణానికి హాని చేయని "సుస్థిర శీతలీకరణ విధానాల" వైపు ప్రపంచం అడుగులు వేయాల్సిన అవసరాన్ని ఈ థీమ్ నొక్కిచెబుతోంది.

**ముప్పు వెనుక మానవ స్వార్థం..!**

భూమి నుంచి 15 నుండి 35 కిలోమీటర్ల ఎత్తులో ఉండే స్ట్రాటోస్ఫియర్ ఆవరణమే జీవకోటికి ఆయువుపట్టు. ఆధునిక జీవనంతో పల్లె నుంచి పట్టణం దాకా కాలుష్యం కోరలు చాచడం వల్లనే భూరక్షణ కవచం ప్రమాదంలో పడింది. ముఖ్యంగా పర్యావరణానికి హాని కల్గించే కర్బన సమ్మేళనాలైన హేలోన్స్, మిథైల్ క్లోరోఫామ్, మిథైల్ బ్రోమైడ్, క్లోరో ఫ్లోరో కార్బన్స్ వంటివి విచ్చల విడిగా గాలిలో కలిసిపోతున్నాయి. ఇది మానవుడు తమ అవసరాలకు గాక మితిమీరిగా ఉపయోగిస్తున్న వస్తువుల వల్ల జరుగుతోందనేది కఠోర వాస్తవం. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల నుంచి వస్తున్న విషవాయువుల వల్ల కాలుష్యం రోజురోజుకు పెరుగుతుండటంతో, వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. ఏరోసాల్స్ ఉత్పత్తులు, రిఫ్రిజిరేటర్లు, ఫోమ్ బ్లోయింగ్ అప్లికేషన్లు, ఇబ్బడి ముబ్బడిగా ఎయిర్ కూలర్లను వాడటం వల్ల ఓజోన్ పొర పలుచబడుతోంది. మానవ తప్పిదాలతో సకల జీవరాశులపై ఈ ప్రభావం పడుతున్నది. ఓజోన్ పలుచబడితే చర్మ క్యాన్సర్లు, కంటి శుక్లాలు పెరగడమే కాక, సముద్రపు ప్లాంక్టన్ దెబ్బతిని ఆహార గొలుసు చిన్నాభిన్నమవుతుంది. పట్టణీకరణ, విచ్చలవిడి పారిశ్రామికీకరణ పేరుతో మన నిత్య జీవితంలో వాడుతున్న ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ఏరోసాల్ స్ప్రేలు, రసాయనాల నుంచి వెలువడే క్లోరో ఫ్లోరో కార్బన్లు, హైడ్రోఫ్లోరోకార్బన్లు వాతావరణంలో కలవడమే ఈ క్షీణతకు ప్రధాన కారణం.

**దౌత్య విజయం -- ఆశాజనక మార్పు....!**

మానవాళి చరిత్రలోనే పర్యావరణ పరిరక్షణకు సంబంధించి అత్యంత సఫలీకృతమైన అంతర్జాతీయ ఒప్పందం 1987 నాటి మాంట్రియల్ ప్రోటోకాల్. దీనికి అనుగుణంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు సి ఎఫ్ సి రసాయనాల వినియోగాన్ని క్రమంగా నిలిపివేశాయి. ఐక్యరాజ్యసమితి తాజా నివేదికల ప్రకారం --- కఠిన నిబంధనలు పాటించడం వల్ల ఓజోన్ పొర ప్రతి దశాబ్దానికి ఒక శాతం నుండి మూడు శాతం వేగంతో పునరుద్ధరించబడుతోంది. ఇదే ధోరణి కొనసాగితే 2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా, 2066 నాటికి అంటార్కిటికా ప్రాంతంలో ఓజోన్ పొర పూర్వ స్థితికి చేరుకుంటుందని సైంటిఫిక్ అసెస్మెంట్ ప్యానెల్ స్పష్టం చేస్తోంది.

**భవిష్యత్ కార్యాచరణ మనదే.....!**

సాంకేతికత ఎంత ఎదిగినా ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే మానవ మనుగడ శూన్యం. కేవలం ప్రభుత్వాల ప్రతిచర్యలతోనే ఇది సాధ్యపడదు. భావితరాలు అందివచ్చిన విలాసాలను విచ్చలవిడిగా వాడుకోవడం తగ్గించాలి. ఏసీలు, కాస్మెటిక్స్, ఫెర్ఫ్యూమ్ స్ప్రేల నుండి మనం నిత్యం వాడే మొబైల్ ఫోన్లు, ప్లాస్టిక్ వస్తువుల వాడకంలో పరిమితులను పెట్టుకోవాలి. మితిమీరిన ఇంధన వాడకాన్ని తగ్గించాలి. క్లోరో ఫ్లోరో కార్బన్ పదార్థాల వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయంగా ద్రవ నైట్రోజన్ వాడాలి. పర్యావరణ అనుకూల 'గ్రీన్ రిఫ్రిజిరెంట్' ఉపకరణాలను ఎంచుకోవడం, సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచడం, అడవులను సంరక్షించి విస్తారంగా మొక్కలు నాటడం ద్వారా ప్రతి పౌరుడూ ఓజోన్ పరిరక్షణలో భాగస్వామి కావాలి. భూగోళాన్ని వేడెక్కించకుండా కాపాడుకోవడమే మనం భావితరాలకు ఇచ్చే నిజమైన కానుక.

# మున్నూరు కాపు మండల నూతన కమిటీ ఏర్పాటు



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** రామారెడ్డి మండల మున్నూరు కాపు ఐక్యత మరింత పెరగాలని మున్నూరు కాపు మండల కమిటీ 3 సంవత్సరాల కాల పరిమితి ముగిసిన సందర్భంగా మంగళవారం 15 న మున్నూరు కాపు రామారెడ్డి మండల కొత్త కమిటీనీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క మున్నూరు కాపు రామారెడ్డి మండల కమిటీలో మండల అధ్యక్షుడిగా ల్యాగల మహిపాల్ ని, అలాగే గౌరవ అధ్యక్షులుగా చెన్నంచెట్టి రమేష్ ని(కన్నాపూర్), ప్రధాన కార్యదర్శి బండి లింగం, కోశాధికారి ఉప్పల్వాయి రాజు(రెడ్డిపేట), ప్రచార కార్యదర్శి కడెం సాయికుమార్,ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని తెలిపారు.

# సహజ వ్యవసాయంపై మక్కువ చూపాలి

**-- జిల్లా అధికారి మోహన్ రెడ్డి**



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15(ప్రజాజ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రం పోసానిపేట్ రైతు వేదిక ప్రాంగణంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి పాల్గొనడం జరిగింది. రైతు నేస్తం మరియు జాతీయ సహజ వ్యవసాయం ఓరియంటేషన్ ప్రోగ్రాం, నిర్వహించారు. తదుప రీ సహజ వ్యవసాయం కి ఎంపిక అయ్యిన రంగంపేట మరియు గోకుల్ తండా గ్రామ రైతులకు సహజ వ్యవసాయం కి సంబంధించిన రైతు కిట్ నీ అందించడం జరిగింది. ఈ సమావేశం లో రైతులకు సహజ వ్యవసాయం ప్రాముఖ్యత,వివిధ రకాల కాషాయాల తయారీ గురించి వివరించడం జరిగింది. ఏడిఏ ఎల్లారెడ్డి సుధ మాధురి, ఏడిఏ టెక్నికల్ భారతి, ఏఓ సుస్మిత, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ భానుశ్రీ , ఏఈఓ రాణి, రాకేష్ మినుకుల, మానస,సుమలత, సహజ వ్యవసాయం రైతు కందూరి బాలరాజు మరియు రైతులు పాల్గొనారు.

## తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు

# కామ్రేడ్ ఆరుట్ల కమలాదేవి

**తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు**

**జె.జె.సి.పి. బాబూరావు రీసెర్చ్ స్కాలర్**






**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపా ర్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొర నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమెందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. నిజాం నిజాం నిరంకుశత్వ పాలనకు, భూస్వాములు దురాగతాలకు, రజాకార్ల ఆకృత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఆరుట్ల కమలాదేవి. భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) నేతృత్వంలో కొనసాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో మహిళా గెరిల్లా నాయకురాలుగా ఆమె తిరుగులేని గెరిల్లా పోరాట పటిమను ప్రదర్శించారు. మహిళ అయిననూ ఆమె ఏమాత్రం అదరక, బెదరక చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి ఉద్యమించి విప్లవస్ఫూర్తికి ప్రతీకగా నిలిచారు. భర్త ఆరుట్ల రామచంద్రారెడ్డితో పాటు కలిసి ఆమె సమానంగా గెరిల్లా పోరాటంలో ముందుకు సాగడం అనన్యసామాన్యం.

ఆరుట్ల కమలాదేవి ఉమ్మడి నల్గొండ జిల్లా ( ప్రస్తుత యాదాద్రి జిల్లా ) లోని మంతపురి గ్రామంలో 1920 లో పల్లా లక్ష్మీ నరసమ్మ మరియు వెంకట్రామ్ రెడ్డి దంపతులకు జన్మించారు. ఆమె తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన అసలు పేరు 'రుక్మిణి'. అప్పటి సామాజిక కట్టుబాట్ల కారణంగా ఆరుట్ల కమలాదేవి విద్యను అభ్యసించలేకపోయారు. ఆమె పదకొండేళ్ల వయసులోనే ఆరుట్ల రామచంద్రారెడ్డిని వివాహం చేసుకున్నారు. కమలాదేవిని ఉన్నత విద్యను అభ్యసించమని భర్త ఆరుట్ల రామచంద్రారెడ్డి ప్రోత్సహించచడంతో హైదరాబాదులోని ఆంధ్రా గర్ల్స్ హైస్కూలులో చేరారు. ఆమె హెచ్.ఎస్.సి పూర్తి చేసి తన భర్త మహిళల కోసం ప్రారంభించిన రహస్య పాఠశాలలో తాను ఉపాధ్యాయురాలి గా పనిచేశారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి జీవితంపై గణనీయమైన ప్రభావాన్ని చూపిన కమ్యూనిస్టు అయిన కమలాదేవి చటోపాధ్యాయ స్ఫూర్తితో 'రుక్మిణి' తన పేరును 'కమలాదేవి' అని మార్చుకుని ఆ విధంగానే పిలవబడ్డారు.

నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ పాలనకు మద్దతుగా ఖాసిం రజ్వీకి చెందిన రజాకార్లు కమ్యూనిస్టులపై దుర్మార్గంగా వ్యవహరించసాగారు. ఈ పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంస్థ అయిన ఆంధ్ర మహాసభలో సభ్యురాలిగా చేరడానికి ఆరుట్ల కమలాదేవికి అవకాశం అందిరాగా ఆమె ఆరవ మరియు ఏడవ ఆంధ్ర మహాసభలకు హాజరై పోరాట చైతన్యాన్ని మరియు రాజకీయ అవగాహనను పెంపొందించుకున్నారు. 'మహిళలకు ఆత్మరక్షణ అవసరం' అని భావించి సైనిక శిక్షణ పొందిన ఆరుట్ల కమలాదేవి నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేక జ్వాలలు రగిలించారు.

ఆరుట్ల కమలాదేవి హైదరాబాద్ రాష్ట్రంలో మహిళల హక్కుల కోసం ఉద్యమించారు. ఒక దశలో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లవలసి వచ్చింది. అజ్ఞాతంలో ఉన్న కాలంలో ఆమె చల్లూరు అటవీ ప్రాంతాలలో చురుకైన గెరిల్లా నాయకురాలుగా పనిచేశారు. ఆమె తన భాగస్వామి ఆరుట్ల రామచంద్రారెడ్డితో కలిసి నల్గొండ జిల్లాలోని ఆలేరు ప్రాంతంలో సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. రజాకార్ల దురాగతాలను ఎదుర్కోడానికి మహిళా గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో చల్లూరు గ్రామం గెరిల్లా దళాలకు ముఖ్య కేంద్రంగా ఉండేది. పోలీసులు ఒక దశలో ఆ దంపతుల జాడను గుర్తించి ఆరుట్ల రామచంద్రారెడ్డిని ఖమ్మం జైలుకు తరలించారు. అలాగే ఆరుట్ల కమలాదేవిని మొదటగా వరంగల్ జైలుకు, ఆ తర్వాత ఔరంగాబాద్ జైలుకు, అక్కడి నుంచి సికింద్రాబాద్ జైలుకు తరలించారు. జైళ్ళలో కూడా న్యాయం కోసం ఆమె నినదించారు. 1951 లో ఆమె జైలు నుండి విడుదల అయ్యారు.ఆరుట్ల కమలాదేవి 1952 మరియు 1957 నాటి అసెంబ్లీ ఎన్నికల్లో పి.డి.ఎఫ్ అభ్యర్థినిగా ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీచేసి శాసన సభ్యురాలుగా ఘనవిజయం సాధించారు. ఆ తరువాత 1962 లో భారత కమ్యూనిస్టు పార్టీ ( సి.పి.ఐ) తరపున ఆమె పోటీ చేసి శాసన సభ్యురాలుగా ఘన విజయం సాధించారు. ఆ రకంగా ఆరుట్ల కమలాదేవి 1952 నుండి 1967 వరకు ఆలేరు నియోజకవర్గానికి వరుసగా 3 పర్యాయాలు శాసన సభ్యురాలుగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించి సరికొత్త చరిత్ర సృష్టించారు. 1962 లో రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ( సి.పి.ఐ) ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తించబడి పుచ్చలపల్లి సుందరయ్య ప్రతిపక్ష నాయకుడు గాను మరియు ఆరుట్ల కమలాదేవి ఉపాధ్యక్షురాలి గాను నియమితులయ్యారు. అలాగే ఆమె భారతదేశంలో మొట్టమొదటి మహిళా ప్రతిపక్ష నాయకురాలిగా నిలిచి నవచరిత్రని సృష్టించారు.ఆరుట్ల కమలాదేవి చేసిన సేవలకు గుర్తించిన కాకతీయ విశ్వవిద్యాలయం 1998 లో ఆమెకు గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం నిబద్ధత, నిమగ్నత, కార్యదీక్ష మరియు అంకితభావంతో ముందుకు సాగుతూ పోరాటాలు కొనసాగించిన ఆమె జీవితం పోరాటస్ఫూర్తికి దార్శనికంగా నిలుస్తుంది. సమసమాజాన్ని కాంక్షించిన ఆరుట్ల కమలాదేవి 2001 జనవరి 1 నాడు మరణించిననూ ఆమె భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ధ్రువతారగా వెలుగొందుతూనే ఉన్నారు.

## వినాయక మండపాలకు ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి లడ్డూ ప్రసాదాల పంపిణీ



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 15 ప్రజా జ్యోతి** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని కామారెడ్డి నియోజకవర్గంలోని వినాయక మండపాలకు బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు సైతం ప్రసాదాలను అందజేస్తూ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కామారెడ్డి మండలం దేవునిపల్లి కేంద్రంలోని హోలియా దాసరి వినాయక మండపానికి లడ్డూ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి తరఫున బీజేపీ నాయకులు, కార్యకర్తలు మండపం కమిటీ సభ్యులకు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాల్లోని మండపాలకు కూడా ప్రసాదాలు అందించడం పట్ల మండపం కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు.


ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మండపం కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ విద్యా విధానం భేష్!

**చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతకు పెద్దపీట**

**జపాన్ పాఠశాలలను ప్రత్యక్షంగా పరిశీలించిన కామారెడ్డి ఉపాధ్యాయులు పి. ప్రవీణ్ కుమార్, కె. ఇందిరా**





**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలపై జ్ఞానం అందించడమే కాకుండా, వారిని క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే జపాన్ విద్యా విధానంలో ప్రధాన లక్ష్యంగా కనిపించిందని కామారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచర్స్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్లో భాగంగా సెప్టెంబర్ 5 నుంచి 12 వరకు జపాన్‌లో పర్యటించిన చిన్నమల్లారెడ్డి జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి. ప్రవీణ్ కుమార్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొండాపూర్ ఉపాధ్యాయురాలు కె. ఇందిరా అక్కడి పాఠశాలలు, తరగతి గదులు, బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

జపాన్ విద్యా వ్యవస్థను పరిశీలించిన సందర్భంగా అక్కడ పాఠశాల విద్యను ప్రధానంగా ఎలిమెంటరీ స్కూల్, జూనియర్ హైస్కూల్, సీనియర్ హైస్కూల్ దశలుగా కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. ఎలిమెంటరీ స్థాయిలో 1 నుంచి 6వ తరగతి వరకు, జూనియర్ హైస్కూల్‌లో 7 నుంచి 9వ తరగతి వరకు, సీనియర్ హైస్కూల్‌లో 10 నుంచి 12వ తరగతి వరకు విద్య కొనసాగుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యం, భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణకు ప్రాధాన్యత**

జపాన్ విద్యా విధానంలో తమను ప్రత్యేకంగా ఆకట్టుకున్న అంశం చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత, సామాజిక బాధ్యత, సహకార భావన, నైతిక విలువలను పెంపొందించడమేనని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠ్యాంశాలతో పాటు రోజువారీ పాఠశాల కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

**తరగతి గదిలో విద్యార్థే కేంద్రబిందువు**

జపాన్ పాఠశాలల్లో తరగతి బోధనను పరిశీలించినప్పుడు ఉపాధ్యాయుడు మాత్రమే మాట్లాడే విధానానికి భిన్నంగా విద్యార్థులను ప్రశ్నించేలా, ఆలోచించేలా, చర్చించేలా ప్రోత్సహిస్తున్నట్లు గమనించామని తెలిపారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా ఉపాధ్యాయులు అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. సమాధానం తప్పుగా వచ్చినప్పటికీ విద్యార్థి చేసిన ప్రయత్నాన్ని ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, స్వతంత్ర ఆలోచనా శక్తిని పెంపొందిస్తున్నారని పేర్కొన్నారు. "విద్యార్థి ఎంత గుర్తుపెట్టుకున్నాడన్నదానికంటే, నేర్చుకున్న విషయాన్ని ఎంతగా అర్థం చేసుకున్నాడు, దాన్ని ఎక్కడ ఉపయోగించగలడు అన్నదానికే ఎక్కువ ప్రాధాన్యత కనిపించింది" అని తెలిపారు.

**బట్టీ చదువుకు బదులుగా అనుభవపూర్వక అభ్యాసం**

జపాన్ పాఠశాలల్లో పుస్తకంలోని విషయాలను కేవలం చదివించి పరీక్షలకు సిద్ధం చేయడం కంటే ప్రాజెక్టులు, ప్రయోగాలు, గ్రూప్ కార్యకలాపాలు, పరిశీలన, చర్చలు, అనుభవపూర్వక అభ్యాసానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రత్యేకంగా సైన్స్ బోధనలో విద్యార్థులు స్వయంగా పరిశీలించడం, ప్రశ్నించడం, ప్రయోగించడం, ఫలితాలను విశ్లేషించడం వంటి ప్రక్రియలకు అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. దీనివల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యం పెరుగుతున్నట్లు గమనించామని తెలిపారు.

**పాఠశాల పరిశుభ్రతలో విద్యార్థులే భాగస్వాములు**

జపాన్ పాఠశాలల్లో తమను విశేషంగా ఆకట్టుకున్న మరో అంశం పాఠశాల పరిశుభ్రతలో విద్యార్థుల భాగస్వామ్యం అని పేర్కొన్నారు. విద్యార్థులు తరగతి గదులు, పాఠశాల పరిసరాలను స్వయంగా శుభ్రం చేసుకోవడం ద్వారా బాధ్యత, స్వయం ఆధారితత్వం, క్రమశిక్షణ, ఇతరుల పట్ల గౌరవం వంటి లక్షణాలు పెంపొందుతున్నాయని తెలిపారు.

ఇది కేవలం పాఠశాలను శుభ్రంగా ఉంచే కార్యక్రమం మాత్రమే కాదని, విద్యార్థులకు జీవిత విలువలను ఆచరణలో నేర్పించే విద్యా ప్రక్రియగా అక్కడ కొనసాగుతున్నట్లు అభిప్రాయపడ్డారు. మంచి మార్కులతో పాటు మంచి మనిషిని తయారు చేయడమే లక్ష్యం జపాన్ పాఠశాలల్లో నిజాయితీ, గౌరవం, దయ, సహకారం, పట్టుదల, సమయపాలన, బాధ్యత వంటి నైతిక విలువలను విద్యార్థుల రోజువారీ జీవితంలో భాగంగా చేస్తున్నారని తెలిపారు. "మంచి మార్కులు సాధించే విద్యార్థిని తయారు చేయడం మాత్రమే కాదు.. మంచి మనిషిని, బాధ్యతాయుతమైన పౌరుడిని తయారు చేయడం కూడా విద్య లక్ష్యంగా కనిపించింది" అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

**ఉపాధ్యాయుల నిరంతర అభ్యాసం**

జపాన్‌లో ఉపాధ్యాయులు కూడా నిరంతరం నేర్చుకుంటూ తమ బోధనా పద్ధతులను మెరుగుపరుచుకునే విధానం ఆకట్టుకుందని తెలిపారు. ఉపాధ్యాయులు కలిసి పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, బోధనా ప్రక్రియను పరిశీలించడం, పరస్పరం అభిప్రాయాలను పంచుకోవడం, విద్యార్థుల అభ్యాసాన్ని మరింత మెరుగుపరిచేందుకు మార్గాలను అన్వేషించడం వంటి కార్యక్రమాలు అక్కడి విద్యా నాణ్యత పెంపునకు దోహదపడుతున్నాయని చెప్పారు.

**ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర విద్య**

ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల విద్యకు కూడా జపాన్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రత్యక్ష పరిశీలనలో తెలుసుకున్నామని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలు, అవసరాలకు అనుగుణంగా సహాయక చర్యలు అందిస్తూ, వీలైనంతవరకు వారిని సాధారణ విద్యా ప్రక్రియలో భాగస్వాములను చేస్తున్నారని చెప్పారు. దీంతో విద్యార్థుల్లో సమానత్వం, సహానుభూతి, పరస్పర గౌరవం వంటి విలువలు పెంపొందుతున్నాయని పేర్కొన్నారు.

**క్రీడలు, కళలు, సంస్కృతికి సమాన ప్రాధాన్యత**

విద్యార్థుల ప్రతిభను కేవలం పరీక్షలు, మార్కులతో మాత్రమే అంచనా వేయకుండా క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమూహ కార్యకలాపాలకు కూడా జపాన్ పాఠశాలల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సహకార భావన, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందుతున్నట్లు గమనించామని చెప్పారు.

**విపత్తు నిర్వహణపై ముందస్తు శిక్షణ**

ప్రకృతి విపత్తులను ఎదుర్కొనే విషయంలో కూడా జపాన్ పాఠశాలలు విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. మాక్ డ్రిల్స్, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, సురక్షితంగా ఎలా వ్యవహరించాలి వంటి అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారని చెప్పారు.

**టెక్నాలజీని బోధనకు సహాయక సాధనంగా వినియోగం**

తరగతి గదుల్లో ఐసీటీ, డిజిటల్ టెక్నాలజీని బోధనను మరింత ఆసక్తికరంగా, అర్థవంతంగా మార్చేందుకు వినియోగిస్తున్నారని తెలిపారు. అయితే సాంకేతికతను ఉపాధ్యాయుడికి ప్రత్యామ్నాయంగా కాకుండా, ఉపాధ్యాయుడి బోధనను బలోపేతం చేసే సాధనంగా ఉపయోగిస్తున్న విధానం తమను ఆకట్టుకుందని పేర్కొన్నారు.

**తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలకు అన్వయించుకోవచ్చు**

జపాన్‌లో గమనించిన అనేక మంచి పద్ధతులను తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లోనూ అన్వయించుకోవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ప్రయోగాత్మక బోధన, సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, డిజిటల్ బోధన వంటి కార్యక్రమాలను మరింత బలోపేతం చేసేందుకు జపాన్ అనుభవం ఉపయోగపడుతుందని చెప్పారు.

**"జపాన్ నుంచి జ్ఞాపకాలు మాత్రమే కాదు.. కొత్త బోధనా ఆలోచనలు"**

జపాన్ పర్యటన తనకు కొత్త విద్యా దృక్పథాన్ని అందించిందని ఉపాధ్యాయుడు పి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. అక్కడ తాను చూసిన ప్రతి మంచి పద్ధతి తన తరగతి గదిని మరింత ప్రభావవంతంగా ఎలా మార్చాలనే ఆలోచన కలిగించిందన్నారు.

"ఈ పర్యటన ముగింపు కాదు.. నా బోధనా ప్రయాణంలో ఒక కొత్త ఆరంభం. జపాన్‌లో నేర్చుకున్న మంచి అంశాలను నా విద్యార్థుల కోసం ఆచరణలోకి తీసుకురావడమే ఈ అనుభవానికి నేను ఇచ్చే నిజమైన గౌరవం" అని ఆయన పేర్కొన్నారు.

జపాన్ విద్యా విధానంలో విద్యార్థి కేంద్రిత బోధన, క్రమశిక్షణ, పరిశుభ్రత, నైతిక విలువలు, అనుభవపూర్వక అభ్యాసం, ఉపాధ్యాయుల నిరంతర అభ్యాసం వంటి అంశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని ఉపాధ్యాయురాలు కె. ఇందిరా తెలిపారు. ఈ అనుభవాలను తెలంగాణ పాఠశాలల్లో ఆచరణాత్మకంగా వినియోగించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

జపాన్ పర్యటన ద్వారా పొందిన అనుభవాలు తమ వ్యక్తిగత బోధనా నైపుణ్యాలకే కాకుండా, తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మరింత నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందించేందుకు ఉపయోగపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కళాకారుల ఉద్యోగాలపై కాలయాపన వద్దు

**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచి, గ్రామగ్రామాన తిరుగుతూ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారుల జీవితాలతో ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సొంటెం సాయిలు యాదవ్ తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను గుర్తించి, సాంస్కృతిక సారథిలో అర్హులైన నిరుద్యోగ కళాకారులకు 1,000 ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కళాకారుల ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేయడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఉద్యమ కళాకారులు, నిరుద్యోగ కళాకారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి కళాకారుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర మరువలేనిది

సొంటెం సాయిలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మహా ఉద్యమంలో కళాకారులు పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. గోసి, గొంగడి ధరించి గ్రామగ్రామాన తిరుగుతూ పోరుపాటలు పాడుతూ, ధూంధాం కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమానికి బలమైన ఊపునిచ్చిన వారిలో కళాకారులు ముందువరుసలో ఉన్నారని పేర్కొన్నారు.

ఎండ, వానలను లెక్కచేయకుండా, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ కళాకారులు ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. తమ జీవితాలను సైతం పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన కళాకారులకు రాష్ట్రం ఏర్పడిన తరువాత సరైన గుర్తింపు, ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

550 ఉద్యోగాలతోనే సరిపెట్టారు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో 550 మందికి ఉద్యోగాలు కల్పించిందని సొంటెం సాయిలు తెలిపారు. అయితే అర్హులైన నిజమైన ఉద్యమ కళాకారుల్లో చాలామందికి ఉద్యోగాలు దక్కలేదని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీలో అనేక మంది అర్హులైన కళాకారులకు అన్యాయం జరిగిందని, దీనిపై న్యాయపరమైన పోరాటాలు కూడా జరిగాయని తెలిపారు.

అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం కళాకారుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ప్రతి అర్హుడైన కళాకారుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైంది?

ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో కళాకారులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని సొంటెం సాయిలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన



కొద్దికాలంలోనే కళాకారుల సమస్యలను పరిష్కరిస్తామని, వారికి ఉద్యోగాలు కల్పించి ఆదుకుంటామని హామీలు ఇచ్చారని పేర్కొన్నారు.

అంతేకాకుండా కళాకారులకు 1,000 ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఈ అంశాన్ని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపరిచిందని తెలిపారు. ఆనాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కళాకారుల సమస్యలపై ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నోసార్లు ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసి కళాకారుల సమస్యలను వివరించి ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరినా ఇప్పటివరకు స్పష్టమైన ఫలితం కనిపించలేదని అన్నారు.

శాసనసభలో ప్రకటనతో సరిపెట్టొద్దు

ఇటీవల శాసనసభలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కళాకారులను ఆదుకుంటామని చెప్పడం మాత్రమే కాకుండా, ఆ హామీని కార్యరూపంలోకి తీసుకురావాలని సొంటెం సాయిలు కోరారు.

కళాకారుల సమస్యలపై శాసనసభలో మాటలు చెప్పడం కంటే ఉద్యోగాల భర్తీకి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసి, ఖాళీలను గుర్తించి, అర్హతలను నిర్ణయించి, వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాలయాపన చేస్తే నిరుద్యోగ కళాకారుల సమస్య మరింత తీవ్రమవుతుందని అన్నారు.

కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందా లేదా అన్నది ఉద్యోగాల భర్తీ ద్వారానే స్పష్టమవుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర కమిటీతో సీఎం వెంటనే చర్చలు జరపాలి

తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే సమావేశం నిర్వహించాలని సొంటెం సాయిలు డిమాండ్ చేశారు.

కళాకారుల సమస్యలను పూర్తిగా తెలుసుకుని, అర్హులైన వారిని గుర్తించి, సాంస్కృతిక సారథిలో 1,000 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఉద్యోగాల భర్తీకి అవసరమైన పరిపాలనా అనుమతులు, ఆమోదాలు వెంటనే పూర్తి చేసి నోటిఫికేషన్ జారీ చేయాలని అన్నారు.

33 జిల్లాల కళాకారులతో ఉద్యమం

ప్రభుత్వం ఇకనైనా స్పందించకుండా కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు హెచ్చరించారు. తెలంగాణలోని 33 జిల్లాల కళాకారులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టడంతో పాటు అవసరమైతే 'చలో రవీంద్రభారతి' కార్యక్రమం నిర్వహించి ముట్టడిస్తామని హెచ్చరించారు. కళాకారుల సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కళాకారుల సమస్యలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తే భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమ కళాకారులు, నిరుద్యోగ కళాకారులు, సాంస్కృతిక రంగానికి చెందిన వారంతా ఏకతాటిపైకి వచ్చి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

'కాలయాపన వద్దు.. కళాకారుల ఉద్యోగాలు ముద్దు'

'కాలయాపన వద్దు.. కళాకారుల ఉద్యోగాలు ముద్దు' అనే నినాదంతో ప్రభుత్వం వెంటనే స్పందించాలని సొంటెం సాయిలు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యపరిచిన కళాకారులను ఇప్పుడు నిరుద్యోగులుగా వదిలేయడం సమంజసం కాదన్నారు.

ఉద్యమ సమయంలో పాటతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన కళాకారులు తమ సమస్యల పరిష్కారం కోసం కూడా అదే పాటను ప్రజా ఉద్యమంగా మలుస్తారని తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా కళాకారుల ఐక్య ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన కళాకారులకు ప్రభుత్వం తగిన గౌరవం ఇవ్వాలని, వారికి ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కళాకారుల కుటుంబాల పరిస్థితులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని తక్షణమే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి తుది విజ్ఞప్తి

ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీతో చర్చలు జరపాలని సొంటెం సాయిలు కోరారు. 1,000 ఉద్యోగాల భర్తీకి వెంటనే ఆమోదం తెలిపి, నోటిఫికేషన్ విడుదల చేసి, నియామక ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

లేకపోతే రాష్ట్రంలోని అన్ని జిల్లాల కళాకారులను కలుపుకుని ప్రజాస్వామ్య పద్ధతిలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు దేవరాజు, వడ్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల శంకర్, కోశాధికారి సొంటెం రాజలింగం యాదవ్, కార్యదర్శి అన్నబోయిన శ్రీనివాస్, సొంటెం ఎల్లయ్య, వడ్ల వెంకన్న, ఉప్పల్ వై. నరసింహులు, గడ్డం శ్రీనివాస్, శ్యామ్ రాజు, మధు, సుంకరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు రెడ్డి రాజయ్యతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదు

**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా పోలీస్ అధికారులు సమన్వయంతో, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో శాంతిభద్రతలు, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు, గణేష్ ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై ఆయన సమగ్రంగా సమీక్షించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాలను పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతర గస్తీ నిర్వహిస్తూ 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అవసరమైన భద్రతా సూచనలు అందించాలని తెలిపారు.

**నిమజ్జనాలకు ముందస్తు ప్రణాళిక**

గణేష్ ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో రానున్న రోజుల్లో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిమజ్జనాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాల్లో అవసరమైన పోలీస్ బందోబస్తు, గస్తీ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

నిమజ్జన రూట్లను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, బందోబస్తు, అవసరమైన పోలీస్ సిబ్బంది ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరిస్తూ నిబంధనలు పాటించాలని ఎస్పీ కోరారు.

**డీజేలకు అనుమతి లేదు**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, అమలులో ఉన్న నిబంధనలకు అనుగుణంగా డీజే వినియోగంపై నిషేధం కొనసాగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి గణేష్ ఉత్సవ కమిటీకి ముందుగానే స్పష్టంగా తెలియజేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.



నిబంధనలను ఉల్లంఘించి డీజేలను వినియోగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో మూడు డీజేలపై కేసులు నమోదు చేసి, డీజే సామగ్రితో పాటు వాటిని తరలిస్తున్న వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

**డప్పు కళాకారులను ప్రోత్సహించాలి**

గణేష్ ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎస్పీ సూచించారు. డీజేలకు బదులుగా డప్పు కళాకారులను గౌరవిస్తూ వారి కళలను ప్రోత్సహించాలని ఉత్సవ కమిటీలను కోరారు. సంప్రదాయ కళలకు ప్రాధాన్యం ఇస్తూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**

గణేష్ ఉత్సవాల నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, నిర్ధారణ లేని సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రజలు నమ్మవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. ఇతర ప్రాంతాల్లో జరిగిన సంఘటనలను కామారెడ్డి జిల్లాకు సంబంధించినవిగా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మతసామరస్యానికి భంగం కలిగించేలా, ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించేలా అబద్ధపు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు లేదా సందేశాలను సోషల్ మీడియాలో ప్రచారం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అనుమానాస్పదమైన లేదా వివాదాస్పద సమాచారాన్ని గుర్తించినప్పుడు దానిని ఫార్వర్డ్ చేయకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**కేసుల దర్యాప్తులో నాణ్యత ఉండాలి**

జిల్లాలో నమోదవుతున్న ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఈ–సాక్ష్య విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, కేసులను చట్టపరమైన గడువులోగా పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. నిందితులకు శిక్షలు పడేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలు, భక్తులు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు సహకరించి భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్, ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, బాన్సువాడ డీఎస్పీ పి. విఠల్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ గట్టుమల్లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌తో పాటు జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఆర్ఎస్ఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాఘవపూర్ తండాలో విద్యార్థులకు షూల పంపిణీ

ఆతుకూరి అంజవ్వకు రూ.1,00,116 చెక్కు అందజేత

రాఘవపూర్ తండాలో విద్యార్థులకు షూల పంపిణీ

సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్

**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం రాఘవపూర్ తండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు షూలను అందజేశారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై చక్కగా చదువుకోవాలని ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు సూచించారు.





విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వారి చదువుకు ప్రోత్సాహం అందించేందుకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవీలత, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక ప్రతిష్ఠాపన**

రాఘవపూర్ గ్రామంలో వినాయక చవితి సందర్భంగా యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుడి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను గ్రామ ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. గ్రామంలో పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా యువత బాధ్యతగా వ్యవహరించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని సూచించారు. యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. రాఘవపూర్ గ్రామానికి చెందిన ఆతుకూరి అంజవ్వకు రూ.1,00,116 విలువైన చెక్కును అందజేశారు. కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, కామారెడ్డి తహసీల్దార్ హేమ బిందు, గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్, జీపీఓ రవి చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారు వాటిని సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. తహసీల్దార్ హేమ బిందు మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామస్థులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని అర్హత ఉన్న పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమం, విద్యార్థుల ప్రోత్సాహానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామ పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ఉప సర్పంచ్ నరేష్, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, జీపీఓ రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఎల్లారెడ్డిలో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ –15(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి పట్టణంలో జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమ ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు.పట్టణంలోని నిమజ్జన రూట్ తో పాటు నిమజ్జనం నిర్వహించే పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను ఆర్డీఓ ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాగ్జీవన్, ఎలక్ట్రికల్ ఏఈ, ఉత్సవ కమిటీ సభ్యులు ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన రూట్ లో ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, విద్యుత్ సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, పెద్ద చెరువు వద్ద క్రేన్లు, లైటింగ్, బారికేడ్ల ఏర్పాటు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ ప్రభాకర్ సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



# ఈనెల 20న బీసీ కలాల అలాయ్ - బలాయ్

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 15(ప్రజా జ్యోతి )** చేతివృత్తుల జీవితాల్లోని సంక్షోభాలను చిత్రించిన తొలి బీసీ కవితా సంకలనం వెంటాడే కలాలు వెనుకబడిన కులాలు ప్రచురితమై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బీసీ రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ కలాల అలాయ్ – బలాయ్ కార్యక్రమం జరగనుంది. 2001లో ప్రచురితమైన ఈ సంకలనం చేతివృత్తుల సాహిత్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ. లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చేతివృత్తుల సాహిత్యాన్ని సృష్టించడం, పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి. శంకరయ్య, డాక్టర్ ఎం. చంద్రకాంత్, జంగం శివకుమార్, డాక్టర్ జి. సిద్ధురాజు, కృష్ణ ప్రసాద్, సురేశ్ రెడ్డి, లక్ష్మణ్, నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పనసపండ్ల మాటున 387 కిలోల గంజాయి.. ఇద్దరిపై పీడీ యాక్ట్

పనసపండ్ల మాటున 387 కిలోల గంజాయి!
రూ.1.93 కోట్ల విలువైన గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులపై పీడీ యాక్ట్
ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా కామారెడ్డి పోలీసుల పట్టివేత
డ్రగ్ మాఫియాపై ఉక్కుపాదం..
యువత భవిష్యత్తుతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదన్న ఎస్పీ ఎం



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా కామారెడ్డి జిల్లా పోలీసులు మరో కీలక చర్య చేపట్టారు. భారీ మొత్తంలో గంజాయిని అక్రమంగా రవాణా చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులపై పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. గత జూన్‌లో కామారెడ్డి జిల్లా పరిధిలో పనసపండ్ల మాటున భారీగా గంజాయిని తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఏకంగా 387.128 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, దాని విలువ సుమారు రూ.1,93,56,400గా పోలీసులు వెల్లడించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 20న ఒడిశా రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు భారీగా గంజాయిని తరలిస్తున్నట్లు దేవునిపల్లి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జాతీయ రహదారి-44పై విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు.

ఈ క్రమంలో కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామ శివారులోని రాయల్ ధాబా సమీపంలో అనుమానాస్పదంగా వెళ్తున్న అశోక్ లేలాండ్ బడా దోస్త్ వాహనాన్ని పోలీసులు అడ్డుకుని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనం పైభాగంలో పనసపండ్లను ఉంచి, వాటి కింద సంచుల్లో గంజాయిని దాచి తరలిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు తనిఖీ చేయగా 387.128 కిలోల గంజాయి బయటపడింది. దీని విలువ రూ.1.93 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఈ కేసులో అప్పట్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పోలీసులు దర్యాప్తును మరింత లోతుగా చేపట్టి గంజాయి సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు, అంతర్రాష్ట్ర నెట్‌వర్క్, ముఠా సభ్యుల పాత్ర, ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. దర్యాప్తులో భాగంగా కీలకంగా వ్యవహరించిన ఇద్దరు నిందితులపై తాజాగా పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఇద్దరిపై పీడీ యాక్ట్**

పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు ఎదుర్కొంటున్న వారిలో ఒడిశా రాష్ట్రం కంధమాల్ జిల్లాకు చెందిన రాజు ఏ రాజ్‌కిషోర్ ప్రధాన్, తండ్రి రామ్‌నాథ్ ప్రధాన్, అలాగే దీపక్ ఏ దీపక్ ప్రధాన్, తండ్రి నభిదాత్య ప్రధాన్ ఉన్నారు. వీరు గంజాయి అక్రమ రవాణా వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా ద్వారా ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో భాగంగానే ఇద్దరిపై పీడీ యాక్ట్‌ను అమలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

**డ్రగ్ మాఫియాకు చోటు లేదు**

జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం వల్ల యువత భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, వాహన తనిఖీలు, నాకాబందీలు, ప్రత్యేక ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు.

డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైన సందర్భాల్లో పీడీ యాక్ట్‌ను కూడా కచ్చితంగా అమలు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్ మాఫియాకు కామారెడ్డి జిల్లాలో ఎలాంటి అవకాశం ఇవ్వబోమని హెచ్చరించారు.

అలాగే జిల్లాలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు, పోలీస్ అధికారులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## తెలంగాణ సాయుధ పోరాటయోధుడు

# కామ్రేడ్ ఆరుట్ల రామచంద్రారెడ్డి

-- తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా
-- జె.జె.సి.పి. బాబూరావు రీసెర్చ్ స్కాలర్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** నిజాం నిరంకుశత్వానికి, దొరల దాష్టీకాలకు మరియు భూస్వాముల ఆగడాలను వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) నేతృత్వంలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం 1946 నుండి 1951 వరకు కొనసాగిన 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం' ప్రపంచ చరిత్రలోనే ప్రముఖ స్థానాన్ని సముపార్జించుకుని నిత్యనూతన చైతన్య స్రవంతిగా వెలుగొందుతూనే ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో 'దున్నేవాడిదే భూమి' అనే నినాదం మార్మోగిపోయింది. 'బాంచెన్ దొరా ... నీ కాళ్లు మొక్కుతా' అన్న పీడిత ప్రజానీకం ఆయుధాలు చేబూని దొరల, భూస్వాముల, పెత్తందారుల అరాచకాలను అంతమెందించారు. ఈ తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగాలతో వేలాది గ్రామాలు వెట్టి చాకిరి నుండి విముక్తి పొందడమే కాకుండా పది లక్షల ఎకరాల భూములు పేద ప్రజలకు పంపిణీ చేయబడ్డాయి. నిజాం నియంతృత్వ పాలనను నిలువరించేందుకు 'సాయుధ పోరాటమే శరణ్యం' అని నమ్మి ఆ దిశగా అడుగులు వేసి సాయుధ పోరాట శంఖారావాన్ని పూరించిన తెలంగాణ సాయుధ పోరాటయోధుడు ఆరుట్ల రామచంద్రా రెడ్డి. భూస్వాముల, పెత్తందారుల, రజాకారుల అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయన రైతాంగాన్ని సాయుధ సమరం వైపు మళ్ళించాడు. ఆయన ఆయా ప్రజా సమస్యల పరిష్కారాల కోసం అవిశ్రాంతంగా ఉద్యమించారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి ఉమ్మడి నల్గొండ జిల్లా ఆలేరు మండలం లోని కొలనుపాక గ్రామంలో 1909 లో రామక్క మరియు రాజారెడ్డి దంపతులకు జన్మించారు. 1930 లో నిర్వహించబడిన 'దండి సత్యాగ్రహ'నికి ఆయన ప్రభావితులై గాంధీజీని ఆదర్శంగా తీసుకొని ముందుకు నడిచారు. క్రమంగా ఆయన 'ఆంధ్ర మహాసభ' కార్యక్రమాలకు ప్రభావితులై ఆ సంస్థ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. నిజాం పాలనలో అరాచకాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ పాలనకు మద్దతుగా ఖాసిం రజ్వీకి చెందిన రజాకార్లు కమ్యూనిస్టులపై దుర్మార్గంగా వ్యవహరించసాగారు. ఈ తరుణంలో 'భూస్వాములకు, జమీందార్లకు, రజాకార్లకు వ్యతిరేకంగా అంతిమంగా ప్రజా వ్యతిరేక నిరంకుశ నిజాం ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలకు సమాయత్తం కావాలి' అని భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) పిలుపు ఇచ్చింది. ఈ పిలుపునకు స్పందించిన ఆరుట్ల రామచంద్రారెడ్డి నిరంకుశ నిజాం ప్రభుత్వంపై పోరాటాలకు సన్నాహాలు మొదలెట్టారు. ఆ క్రమంలోనే ఆయన విజయవాడలో 'గెరిల్లా యుద్ధంలో శిక్షణ' పొందారు. శిక్షణ అనంతరం ఆయన భువనగిరి ప్రాంతంలోని 500 గ్రామాల ప్రజలను సాయుధ పోరాటానికి సన్నద్ధం చేశారు. ప్రజలలోభావోద్వేగాలను రేకెత్తించి వారిలో చైతన్యజ్వాలలు రగిలించేలా ఉపన్యాసాలు ఇవ్వడంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి సిద్ధహస్తుడు. అందులో ఆయనకు మరెవరూ సాటిరారు. అలా ఆయన తన ప్రసంగాల ద్వారా రైతాంగాన్ని సాయుధ పోరాటం వైపు సమాయత్తం చేశాడు. భువనగిరి నుండి సిద్దిపేట వరకు ఉన్న అన్ని గ్రామాలలో పార్టీని నిర్మించే బాధ్యతను ఆయన తన భుజాలపై వేసుకుని ఆ దిశగా అవిశ్రాంతంగా ఉద్యమించారు. ఒకానొక దశలో ప్రజాక్షేత్రంలో ఉండలేని విషమ పరిస్థితుల్లో అరుట్ల రామచంద్రారెడ్డి తన సహచరి ఆరుట్ల కమలాదేవితో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లి సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. అప్పట్లో చల్లూరు గ్రామం గెరిల్లా దళాలకు ముఖ్య కేంద్రంగా ఉండేది. పోలీసులు ఒక దశలో ఆ దంపతుల జాడను గుర్తించి ఆరుట్ల రామచంద్రారెడ్డిని ఖమ్మం జైలుకు తరలించారు. 1952 లో అరుట్ల రామచంద్రారెడ్డి జైలు నుండి విడుదలయ్యారు. 1962 లో భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) తరపున భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఆయన శాసన సభ్యులుగా ఎన్నికై ఆయా ప్రజా సమస్యలను పరిష్కరించారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి ఏనాడు ప్రగల్భాలు పలకలేదు. ఆయన అసలు సిసలైన ఆచరణాత్మకవాది. ఆయన తన జీవితాన్ని పీడిత ప్రజానీకం అభ్యున్నతి కోసం త్యాగం చేసిన నిస్వార్థ కమ్యూనిస్టు. ఆరుట్ల రామచంద్రారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి ఎంతో మంది పేదలకు భూమిని పంపిణీ చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని భూపోరాటాలు నిర్వహించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఆరుట్ల రామచంద్రారెడ్డి 1985 ఆగస్టు 26 నాడు మరణించినను భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఎన్నటికీ చెరిగిపోని పోరాట స్ఫూర్తిగా సజీవంగా వెలుగొందుతూనే ఉన్నారు.

# వినాయక మండపాలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లడ్డూల పంపిణీ

ఇస్రోజీవాడిలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పంపిణీ



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలోని వివిధ వినాయక మండపాలకు కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి అందజేసిన లడ్డూలను మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు పంపిణీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వినాయక మండపాలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి లడ్డూలను బహూకరిస్తూ వస్తున్నారని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే అందజేసిన లడ్డూలను గ్రామంలోని వివిధ వినాయక మండపాలకు తీసుకెళ్లి భక్తులు, మండపాల నిర్వాహకులకు బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నాయకులు కోరారు. గ్రామంలో పండుగ సందర్భంగా ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక వాతావరణం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీజేపీ అధ్యక్షులు పర్సా మహిపాల్, బూత్ అధ్యక్షులు చెట్టుకూరి ప్రశాంత్, మల్లీ గంగయ్య, చెట్కూరి మహిపాల్, రవి వర్మ, రవి కుమార్, సుమన్, పోషయ్య, నగేష్, గోవింద్ రావు, కొకట్ల ప్రశాంత్, గండ్ల రాజు, చెట్కూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు. వినాయక మండపాలకు లడ్డూలను అందజేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏటా కొనసాగుతున్న ఈ సంప్రదాయం వినాయక ఉత్సవాల్లో భక్తులకు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోందని వారు పేర్కొన్నారు.

# నేడు జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ముట్టడి

-- అంబేద్కర్ సంఘం కామారెడ్డి శాఖ పిలుపు

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు క్యాంప్ ఆఫీస్ ముట్టడికి అంబేద్కర్ సంఘము కామారెడ్డి జిల్లా శాఖ పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా. బిఆర్ అంబేద్కర్ పైన అనుచిత వాక్యాలు చేస్తు కల్పిత నాయకుడు ఆని కించపరిచే విధంగా చర్యలు చేస్తున్న హమారా ప్రసాద్ అనే ఒక ద్రోహి పైన ఇప్పటి వరకు స్పందించని దళిత ఎమ్మెల్యే , ఎంపీ ల ఇల్ల ముట్టడి కీ పిలుపును ఇవ్వడం జరిగింది.నేడు జిల్లాలోనీ అన్ని దళిత, బహుజన సంఘాలూ ముట్టడి లొ పాల్గొనాలని అంబేద్కర్ సంఘము జిల్లా అధ్యక్షులు కోతోల్లా గంగారాం పిలుపునిచ్చారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** జిల్లా కేంద్రంలో గల మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరమును నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం తెలిపారు.విద్యార్థులకు కామారెడ్డి డివిజన్ వైద్యాధికారి డాక్టర్ రవీందర్ పటేల్ ఆధ్వర్యంలో వైద్య బృందం వారు కంటి పరిక్షలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో విద్యార్థులందరికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలపై అవగాహన కల్పించారు.మన మనుగడకు కళ్ళు ఎంతో అవసరమని, దృష్టిలోపం గలవారు వెంటనే స్పందించి సకాలంలో డాక్టర్ ని సంప్రదించి చికిత్స చేయించుకోవాలనీ తెలిపారు. ఎలాంటి జాగ్రత్త చేయవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, పాఠశాల నర్సింగ్ ఆఫీసర్ భారతి వైద్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇస్రోజీవాడిలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో మంగళవారం కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన చిందం జ్యోతి, బిరవ్వ చెన్నల, భవానీ, రాజమణి తదితర లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువైన కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, కామారెడ్డి తహసీల్దార్ హేమబిందు, జీపీఓ రవి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# పిట్లంలో బీసీ కమిషన్ పర్యటన

-- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** పిట్లంలో నేడు బీసీ కమిషన్ పర్యటన లోధి కులానికి చెందిన వారి సమస్యల పై అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్ నేడు 16న పిట్లం మండల కేంద్రంలో పర్యటించ నున్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని కమిటీ ఉదయం 9 గంటలకు పిట్లంకు చేరుకుని, అనంతరం లోధి కులానికి చెందిన వారి సమస్యలను అడిగి తెలుసుకోనుంది. లోధి కులానికి చెందిన వారు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.

# ఇస్రోజీవాడిలో అంగరంగ వైభవంగా వినాయక ప్రతిష్ఠాపన

14 ఏళ్లుగా భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్
యువత ఐక్యతకు ప్రతీకగా కొనసాగుతున్న ఉత్సవాలు



**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 15 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండప ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణనాథుడి దర్శనం కోసం గ్రామస్థులు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను నిర్వహించడం ఇది 14వ సంవత్సరం. గత 14 సంవత్సరాలుగా ఎలాంటి విరామం లేకుండా ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా మండపాన్ని ఏర్పాటు చేసి, గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తున్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ఉత్సవాల నిర్వహణలో యువత చూపిస్తున్న ఉత్సాహం ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. గ్రామంలోని యువకులు ఐక్యంగా ముందుకు వచ్చి ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించడం గ్రామస్థులను ఆకట్టుకుంటోంది.

**యువత ఐక్యతకు ప్రతీకగా ఉత్సవాలు**

వినాయక ఉత్సవాల ద్వారా గ్రామంలోని యువతలో ఐక్యత, సోదరభావం, సేవా దృక్పథం పెంపొందుతున్నాయని యూత్ సభ్యులు తెలిపారు. ప్రతి ఏడాది ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకుని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. మండపం అలంకరణ, విద్యుత్ దీపాల ఏర్పాటు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం వంటి పనులను యువత స్వయంగా చేపట్టారు. ప్రతిష్ఠాపన సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా గణపతిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో వినాయక నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు, మహిళలు, వృద్ధులు సైతం ఉత్సవాల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు.

**ఘనంగా కొనసాగనున్న ఉత్సవాలు**

రానున్న రోజుల్లో కూడా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామస్థుల సహకారం తీసుకుంటామని తెలిపారు. 14 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ యువత కృషి చేస్తుండటంపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు. యువత అంతా కలిసికట్టుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, యువకులు, గ్రామస్థులు, భక్తులు, మహిళలు, చిన్నారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బంజారాలకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదు బీఆర్ఎస్ గిరిజన నాయకుల డిమాండ్



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -15(ప్రజా జ్యోతి )** రాష్ట్రంలో బంజారాలకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని బీఆర్ఎస్ గిరిజన నాయకులు ప్రభుత్వానికి ప్రశ్నించారు.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు పట్టణంలో మంగళవారం నియోజకవర్గ గిరిజన నాయకుల ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గిరిజనులకు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని విమర్శించారు. 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు చేసిందేమీ లేదని ఆరోపించారు. గిరిజనులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఏమైందని నిలదీశారు. అసైన్‌మెంట్, పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న హామీని వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ హయాంలో గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించామని, రాష్ట్రవ్యాప్తంగా 3,146 తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించామని గుర్తు చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనే 42 తండాలకు చట్టబద్ధత కల్పించామని, 9 కోట్ల 20 లక్షలతో గిరిజన వసతి గృహం నిర్మించామని, 42 కోట్లతో తండాల్లో బీటీ రోడ్లు వేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ దేనన్నారు.కానీ ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ గిరిజనులను ఓట్ల కోసమే వాడుకున్నారని, ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు ఇవ్వలేదని ఆరోపించారు. కనీస వసతులు కూడా కల్పించలేకపోతున్నారని విమర్శించారు.కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లో సేవాలాల్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసీ భవన్ లను నిర్మించామని, గిరిజనుల కోసం సుమారు రూ.100 కోట్ల ఆస్తులు, రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తండాలకు విద్యుత్, ఇంటింటికీ తాగునీరు, గురుకులాల్లో నాణ్యమైన విద్య, వసతి, భోజన సౌకర్యాలు అందించామని, పదేళ్లలో గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. కాంగ్రెస్ వచ్చాక గురుకులాలు, వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాబోయే ఎన్నికల్లో మళ్ళీ కేసీఆర్ ను ముఖ్యమంత్రిని చేసుకుంటామని, ఎల్లారెడ్డిలో జాజాల సురేందర్ ను ఎమ్మెల్యేగా గెలిపించి ఎల్లారెడ్డి గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ గిరిజన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులకు రూ.50 లక్షలు నిధులు మంజూరు

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడి**

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి) :** నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతులకు రూ. 50 లక్షల నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మంగళవారం అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నగరంలోని వివిధ డివిజన్లకు చెందిన 46 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 32లక్షల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడారు. రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతుల కోసం నిధులు అందించాలని



ఇదివరకు జిల్లా ఇంచార్జి మంత్రిగా వ్యవహరించిన జూపల్లి కృష్ణారావు ను కోరడం జరిగిందని అన్నారు. ఈ మేరకు మంత్రి జూపల్లి పర్యాటక శాఖ ద్వారా రాజీవ్ గాంధీ ఆడిటోరియం మరమ్మతుల కోసం 50 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. అదేవిధంగా ఆర్మూర్ పట్టణంలో గెస్ట్ హౌస్ మరమ్మతులకు, సిద్ధుల గుట్ట కాటేజీ, అతిథి గృహం నిర్మాణాలకు 50 లక్షలు, భీమ్గల్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం అభివృద్ధికి రూ. 4 కోట్ల చొప్పున జిల్లాకు మొత్తం రూ. 5కోట్ల నిధులు మంజూరు చేశారని షబ్బీర్ అలీ వెల్లడించారు. ఈ నిధుల కోసం తనతో పాటు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కూడా కృషి చేశారని తెలుపుతూ, ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు తో పాటు మహేష్ కుమార్ కు కృతజ్ఞతలు ప్రకటించారు. విలేఖరుల సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు

# మద్యం మత్తు.. అతివేగం.. యువకుడి ప్రాణం బలి



**ప్రజాజ్యోతి భీంగల్:** మద్యం సేవించి నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడపడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై భీంగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పురాణిపేటకు చెందిన తీగల అక్షయ్ (23) సెప్టెంబర్ 14న రాత్రి తన స్నేహితుడు స్వరాజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నాడు. బాబాపూర్ వైపు వెళ్తున్న సమయంలో స్వరాజ్ మద్యం మత్తులో వాహనాన్ని అతివేగంగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వెనుక కూర్చున్న అక్షయ్‌కు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి నర్సగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహనం నడిపిన స్వరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై భీంగల్ సీఐ పి. సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా, వేగాన్ని నియంత్రిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# చెరువులో పడి వ్యక్తి గల్లంతు ఆచూకీ తెలిసి రాలేదు

**గన్నారం శివారులో గేదెలను మేపుతుండగా ప్రమాదం**



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 16** ఇందల్వాయి: మండల కేంద్రంలోని గన్నారం శివారులో ఓ వ్యక్తి చెరువులో పడి గల్లంతయ్యాడు. మేఘ్య నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధికి చెందిన కె. మంగ్య రోజువారీగా గన్నారం గ్రామానికి చెందిన గేదెలను తన కుమారుడితో కలిసి మేపేవాడు. రోజువారీ మాదిరిగానే ఈరోజు కూడా తండ్రి, కొడుకులు గేదెలను చెరువుగట్టుకు తోలుకెళ్లారు. గేదెలు చెరువు మధ్యలోకి వెళ్తుండటంతో వాటిని పక్కకు తోలేందుకు మంగ్య ప్రయత్నించాడు. ఈ క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయాడు. మంగ్య కుమారుడు వెంటనే నీటిలోకి వెళ్లి తండ్రి చేతులు పట్టుకుని బయటకు లాగేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో చుట్టుపక్కల వారికి కేకలు వేసి సమాచారం అందించాడు. స్థానికులు అక్కడికి చేరుకుని చూడగా మంగ్య నీటిలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని గుమిగూడిన ప్రజలను అదుపు చేశారు. అయితే ఇప్పటివరకు మంగ్య ఆచూకీ లభించలేదు. అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గణేష్ మండలికి రథం వితరణ.

**రూ.1.70 లక్షల విలువైన రథాన్ని అందజేసిన బంజ లక్ష్మణ్ పటేల్.**



**ఎడపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి):** ఎడపల్లి మండల కేంద్రంలోని వీర హనుమాన్ గణేష్ మండలికి ఎడపల్లి వాస్తవ్యుడు బంజ లక్ష్మణ్ పటేల్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సుమారు రూ.1.70 లక్షల విలువైన గణేష్ శోభాయాత్ర రథాన్ని వితరణ చేశారు. భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించేందుకు ఈ రథాన్ని అందజేయడం పట్ల గణేష్ మండలి నిర్వాహకులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంజ లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకోవడంతో పాటు, గణేష్ ఉత్సవాలకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో రథాన్ని సమకూర్చినట్లు తెలిపారు. గణేష్ శోభాయాత్రలో ఈ రథాన్ని వినియోగించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గణేష్ మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ.

**మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి**

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.**



**ముప్కాల్, ప్రజాజోతి, సెప్టెంబర్ 15** ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మట్టి వినాయక విగ్రహాలను గ్రామస్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు సిద్ధ రమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, పర్యావరణానికి హాని కలుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు సంప్రదాయాన్ని కొనసాగించిన వారమవుతామని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు టి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామ్ రాజ్, సీనియర్ సభ్యులు ఓ. రమేష్, ప్రభాకర్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎల్లారెడ్డి గురుకుల విద్యార్థి ఎంపిక



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -15(ప్రజా జ్యోతి )** ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎల్లారెడ్డి గురుకుల విద్యార్థి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు.కామారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖో-ఖో పోటీల్లో ఎల్లారెడ్డి గురుకులానికి చెందిన విద్యార్థి ఎం. శ్రీనివాస్ పాల్గొని ప్రతిభ కనబరిచాడు. అండర్-17 విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ నిఖిల్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్, కళాశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థి ఎం. శ్రీనివాస్ ను అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అర్జున్‌కు బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఘన సన్మానం



**గాంధారి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ కబడ్డీ అకాడమీలో సీటు సాధించిన పేట్‌సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి భూక్యా అర్జున్‌ను బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పేట్‌సంగం ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఫౌండేషన్ కో-ఫౌండర్ లక్ష్మణ్ రాథోడ్, తోటి క్రీడాకారులతో కలిసి అర్జున్‌ను అభినందించారు.గత జూలైలో హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో శారీరక దారుఢ్యం, సామర్థ్య పరీక్షల్లో అర్జున్ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ప్రవేశం కోసం పోటీపడగా, అర్జున్ తన అద్భుత క్రీడా ప్రదర్శనతో సీటు సాధించడం అభినందనీయమన్నారు.ప్రస్తుతం అర్జున్ మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కబడ్డీ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కబడ్డీలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చీఫ్ ప్యాట్రన్ గుగ్లోత్ సురేందర్, అధ్యక్షురాలు సేవంత రాథోడ్ బాలకృష్ణ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో మట్టి గణపతికి పూజలు

మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -15(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నందు ఈరోజు వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి స్థాపించి ఎల్లాడి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశాలతో ఈరోజు క్యాంప్ ఆఫీస్ నందు మట్టి విగ్రహం స్థాపించటం జరిగిందని అన్నారు మరియు వినాయక చవితి మన దేశంలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ. అయితే ఈ పండుగను భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రతీకగా మార్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందుకే ఈ సంవత్సరం మనం మట్టి గణపతిని ప్రతిష్ఠించుకోవాలి. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసినప్పుడు అది సహజంగా నీటిలో కలిసిపోతుంది. తద్వారా చెరువులు, నదులు, కాలువలు కలుషితం కాకుండా మన వంతు సహాయం చేసినవారమవుతాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారైన విగ్రహాలు, రసాయన రంగులు నీటిలో కలిసినప్పుడు పర్యావరణానికి, జలచరాలకు హాని కలిగించే అవకాశం ఉంది. కాబట్టి భక్తి ఉండాలి... కానీ ప్రకృతికి హాని కలగకూడదు అనే ఆలోచనతో మట్టి గణపతిని ప్రోత్సహిద్దాం అని అన్నారు.

# పంతుల్ నాయక్ తండాకు సీసీ రోడ్డు మంజూరు

**రూ.10 లక్షలతో పనులకు ప్రారంభం**




**గాంధారి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని సోమ్లానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పంతుల్ నాయక్ తండాలో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు పనులకు శ్రీకారం చుట్టారు.తండా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ హరిత-సంతోష్, ఉపసర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు, బూర్గుల్ సర్పంచ్, ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.




## అక్టోబర్ 2న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న 'అనకాపల్లి' చిత్రం!

భవ్య శ్రీ మూవీ మేకర్స్ మరియు నక్కిన నెరేటివ్స్ పతాకాలపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అనకాపల్లి' సినిమా విడుదలకు సర్వం సిద్ధమైంది. అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో నటుడిగా, నిర్మాతగా ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన మరియు కాండ్రేగుల నాయుడు కీలక పాత్రలు పోషిస్తూ నిర్మాణ బాధ్యతలు కూడా నిర్మించారు. విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ సినిమాకు ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ, కథ మరియు స్క్రీన్‌ప్లే రూపకల్పనలో తన వంతు సహకారం అందించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ మరియు పాటలు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను రాబట్టి సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా, కొద్ది రోజుల క్రితం అనకాపల్లి స్థానిక ప్రజల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రీమియర్ షోకు విశేషమైన స్పందన లభించింది. సినిమా చూసిన స్థానిక ప్రజలు చిత్ర యూనిట్‌కు బ్రహ్మరథం పట్టడంతో మేకర్స్‌లో జోష్ మరింత పెరిగింది. ఈ క్రమంలోనే వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విడుదల చేసిన సరికొత్త రిలీజ్ డేట్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని రెట్టింపు చేసింది. కేవలం తెలుగులోనే కాకుండా, తమిళ భాషలోనూ ఈ సినిమాను ఒకేసారి భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలైన మైత్రి మూవీ డిస్ట్రిబ్యూషన్ ఎల్ఎల్‌పి మరియు పూర్వి డిస్ట్రిబ్యూషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకువస్తున్నాయి. టెక్నికల్ పరంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కింది. మాయా.వి సినిమాటోగ్రఫీ అందించగా, శ్రీకృష్ణ అట్లూరి ఎడిటర్‌గా వ్యవహరించారు. విజయవంతమైన డైరెక్టర్ త్రినాధరావు నక్కిన అందించిన కథ, స్క్రీన్‌ప్లే ఈ సినిమాకి ప్రధాన బలంగా నిలవనుండగా, ఉదయ్ భాగవతుల అందించిన మాటలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి. దేవ్ జండ్ సంగీతం సమకూరుస్తుండగా, అనంత శ్రీరామ్, కెకె, గణేష్ సలాది, రాంబాబు గోశాల, తేజ గొర్లె వంటి ప్రముఖులు సాహిత్యమందించారు. శేఖర్ విజె, యష్ మాస్టర్, జిత్తు మాస్టర్ కొరియోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ చిత్రంలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్పలతో పాటు త్రినాధ రావు నక్కిన, ఇంద్రజ అబ్బర్, మహబూబ్ బాషా, శ్రీనివాస్ వడ్లమాని, కాండ్రేగుల నాయుడు, నందిని రాయ్, సంగీత క్రిష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్లపై కాండ్రేగుల నాయుడు, త్రినాధరావు నక్కిన సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా సెట్రామరాజు మల్లెల, ప్రొడక్షన్ డిజైనర్‌గా రఘు కులకర్ణి వ్యవహరించారు. పీఆర్‌ఓగా సాయి సతీష్ మరియు మార్కెటింగ్‌గా స్టార్ సర్కిల్ వ్యవహరిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 2న బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## విక్రమ్ కొత్త సినిమా 'పవర్ హౌస్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో విడుదల!




కోలీవుడ్ స్టార్ హీరో చీయన్ విక్రమ్ నటిస్తున్న తాజా చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వినాయక చవితి కానుకగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. విక్రమ్ కెరీర్‌లో 63వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి 'పవర్ హౌస్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఇరు ముగన్' వంటి సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత విక్రమ్, దర్శకుడు ఆనంద్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ హైప్ ఏర్పడింది. విడుదలైన టైటిల్ ప్రోమో చాలా ఆసక్తికరంగా సాగింది. ఇందులో విక్రమ్ ఒక సాధారణ వెడ్డింగ్ క్యాటరర్‌గా తన కుటుంబంతో సరదాగా కనిపిస్తూనే, మరోవైపు తనలోని డార్క్ అండ్ వయొలెంట్ షేడ్‌ను చూపించి ఆకట్టుకున్నారు. స్టోరేజ్ రూమ్‌లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి కట్టేసి ఉండడం ఈ టీజర్‌లోని ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో ఊర్వశి, విటీవీ గణేష్, రియా షిబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తుండగా, సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఈ టైటిల్ ప్రోమోను బట్టి సినిమాను 2027లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. త్వరలోనే తెలుగు వెర్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా రానున్నాయి.

## ఏషనాగుల సాంగ్.. పుష్ప, దేవర రికార్డ్స్ బ్రేక్..!



నాని హీరోగా వస్తోన్న మాస్ యాక్షన్ మూవీ ది ప్యారడైజ్. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే ప్రమోషన్లతో దూసుకెళ్తున్నారు మేకర్స్. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్ అభిమానులు ఓ ఊపు ఊపేస్తున్నాయి. ఇటీవల రిలీజైన ఫోక్ సాంగ్ ఏషనాగుల ఏకంగా పూనకాలు తెప్పిస్తోంది. ఈ మూవీ యూట్యూబ్‌లో రికార్డులు తిరగరాస్తోంది. తాజాగా ఈ సాంగ్ మరో రికార్డ్ సొంతం చేసుకుంది. విడుదలైన కేవలం 17 రోజుల్లోనే 100 మిలియన్ వ్యూస్ సాధించిన పాటగా నిలిచింది. సింగిల్ లాంగ్వేజ్‌లో అత్యంత వేగంగా ఈ మైలురాయిని అందుకున్న టాలీవుడ్ సాంగ్‌గా రికార్డ్ సృష్టించింది. ఇదే క్రమంలో పుష్ప మూవీలోని ఊ అంటావా మావా, దేవర సినిమాలోని చుట్టమల్లే పేరిట ఉన్న రికార్డులను అధిగమించింది. కాగా.. ఈ మూవీకి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ మూవీ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతమందిస్తున్నారు.




## విడుదలకి సిద్ధమైన 'మిస్సింగ్ మేఘన'.. వైభవంగా ప్రీ రిలీజ్ వేడుక!



టాలీవుడ్ పరిశ్రమలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వైవిధ్యభరితమైన చిత్రం "మిస్సింగ్ మేఘన". ఫస్ట్ కాపి మూవీస్ మరియు కేడి అండ్ కో బ్యానర్లపై పంచుమర్తి నరేష్ బాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి వాచస్పతి దర్శకత్వం వహించారు. రామ్ కార్తీక్, అమ్ము అభిరామి, వైదిక సెంజాలియా, అంకిత్ కొయ్య తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న గ్రాండ్ గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ తాజాగా ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించింది. ప్రముఖ నిర్మాత దామోదర్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో సినిమాకు సంబంధించిన విశేషాలను చిత్ర బృందం ఎంతో ఉత్సాహంగా పంచుకుంది. ముందుగా తంత్ర చిత్ర దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి మాట్లాడుతూ, తన స్నేహితుడైన వాసు (వాచస్పతి) దర్శకత్వంలో నరేష్ బాబు నిర్మాతగా వస్తున్న ఈ చిత్రం ఘనవిజయం సాధించి అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. నటుడు ధనుష్ రఘుముద్రి మాట్లాడుతూ, ఫస్ట్ కాపీస్ బ్యానరే తనకు గుర్తింపునిచ్చిందని, అదే బ్యానర్ నుంచి వస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులందరూ సెప్టెంబర్ 18న థియేటర్లలో తిలకించి విజయవంతం చేయాలని కోరారు. సింగర్ సాకేత్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని పాటలు మరియు విజువల్స్ అద్భుతంగా వచ్చాయని, సినిమాకు సపోర్ట్ చేస్తున్న పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ నటుడు గోపరాజు రమణ మాట్లాడుతూ, దర్శకుడు వాచస్పతి ఒక మంచి కుటుంబ కథను అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే జోనర్స్ తో ఎంతో ఆసక్తికరమైన మలుపులతో తెరకెక్కించారని ప్రశంసించారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధృవన్ మాట్లాడుతూ, ఈ చిత్రానికి పనిచేయడం ఒక చక్కని అనుభూతినిచ్చిందని, బెక్కం వేణుగోపాల్ సహకారంతో మంచి పాటలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రముఖ నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ సినిమాను తాను చూశానని, చాలా ఇంట్రెస్టింగ్ గా ఉండటంతో తాను కూడా సపోర్ట్ చేయడానికి ముందుకు వచ్చానని చెప్పారు. అంకిత్, రామ్ కార్తీక్ ల నటన ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. దర్శకుడు వాచస్పతి మాట్లాడుతూ, కథే ఈ చిత్ర విజలానికి ప్రధాన బలమని, టీమ్ అందరి సపోర్ట్ తో ఈ సినిమాను అద్భుతమైన ప్రమోషన్స్ తో ప్రేక్షకుల ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, తన తొలి చిత్రం నుంచి తనకు మద్దతుగా నిలుస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో సంగీతం, పాటలు ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తాయని, బెక్కం వేణుగోపాల్ మరియు ముఖ్య అతిథి దామోదర్ ప్రసాద్ అందించిన ప్రోత్సాహం ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు.

## బాక్సాఫీస్ వద్ద 'మండాడి' మేనియా..

### 5 రోజుల్లో రూ.65 కోట్లు.. ఓటీటీ డీల్‌తో నిర్మాతకు జాక్‌పాట్!

తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ చిత్రం, విడుదలై కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.65 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బోట్ రేసింగ్ నేపథ్యంతో సాగే వినూత్న కథాంశం, అద్భుతమైన యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థియేటర్లకు క్యూ కట్టేలా చేస్తున్నాయి.ాఖఅస్త్రఋుస్త్రవ =వంశీబతీషివం అయితే ఈ సినిమా కమర్షియల్ విజయంతో పాటు, దీని డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన న్యూస్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రూ.45 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. అయితే, ఈ డీల్ వెనుక ఒక ఆసక్తికరమైన బాక్సాఫీస్ లింక్ ఒప్పందం ఉన్నట్లు తెలుస్తోంది. మొదట నిర్మాత ఎల్రెడ్ కుమార్ రూ.25 కోట్లు డిమాండ్ చేయగా, నెట్‌ఫ్లిక్స్ రూ.15 కోట్లు మాత్రమే ఇవ్వడానికి ముందుకొచ్చింది. దీంతో ఇరువర్గాల మధ్య ఒక వినూత్న షరతుతో కూడిన ఒప్పందం కుదిరింది. సినిమా వసూళ్ల ఆధారంగా పారితోషికం పెరిగేలా ప్లాన్ చేశారు. బాక్సాఫీస్ వద్ద సినిమా రూ.50 కోట్లు దాటితే రూ.30 కోట్లు, అలాగే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మధ్య వసూలు చేస్తే ఏకంగా రూ.40 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.65 కోట్ల మార్క్‌ను అందుకోవడంతో, నెట్‌ఫ్లిక్స్ రూ.40 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టిన బడ్జెట్‌లో సగానికి పైగా కేవలం ఓటీటీ హక్కుల ద్వారానే వెనక్కి వస్తుండటంతో నిర్మాతకు ఇది అసలు సిసలు జాక్‌పాట్ అని చెప్పవచ్చు. ఇదే జోరు కొనసాగితే 'మండాడి' త్వరలోనే వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు





**జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి**

**రైతులకు ఒకరోజు అవగాహన, శిక్షణ కార్యక్రమం**

**ప్రజాజ్యోతి,ఏర్గట్ల, సెప్టెంబర్ 15:**జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా ఏర్గట్ల రైతువేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాలపై వివరించారు.
రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేయడం వల్ల నేల సారవంతతను కాపాడుకోవడంతో పాటు పంటల నాణ్యత పెరుగుతుందని పద్మావతి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని వివరించారు.ఆదర్శ రైతు నవీన్ రైతులకు సహజ పద్ధతుల్లో పంటలు సాగు చేసే విధానాన్ని వివరించారు. పంటలలో సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహజ వనరులను వినియోగించుకునే పద్ధతులను రైతులకు అవగాహన కల్పించారు.జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ సాంకేతిక అధికారి రమేష్ ప్రభుత్వం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేపట్టే రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, పథకం అమలు విధానం, రైతులకు అందే ప్రయోజనాలను వివరించారు.కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు పథకానికి సంబంధించిన కిట్లను గ్రామ సర్పంచ్ ఉపేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సున్నం లక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరిపెల్లి లింగారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, గ్రామ సర్పంచ్ ఉపేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సున్నం లక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరిపెల్లి లింగారెడ్డి, సాంకేతిక అధికారి రమేష్, వ్యవసాయ అధికారి వైష్ణవ్, విస్తరణాధికారి మనీషా, ఆదర్శ రైతు నవీన్‌తో పాటు ఏర్గట్ల మండలానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక తరలింపుపై ఇందల్వాయి పోలీసుల కొరడా

**అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత**

**ఇందల్వాయి: నిజామాబాద్** జిల్లా ఇందల్వాయి మండల కేంద్రం పరిధిలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు చర్యలు చేపట్టారు. తిరుమన్ పల్లి ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న పలు ట్రాక్టర్ ఇందల్వాయి పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.స్థానికంగా కొంతకాలంగా రాత్రింబవళ్లు ఇసుక ట్రాక్టర్ల రాకపోకలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక అవసరమనే పేరుతో కొందరు అనుమతులు లేకుండానే ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.అక్రమంగా ఇసుక తరలింపును ప్రశ్నించే వారిపై కొందరు ట్రాక్టర్ నిర్వాహకులు, ఇసుక తరలింపుదారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తమ వాహనాల ఫొటోలు ఎందుకు తీస్తున్నారని ఎదురు ప్రశ్నించడంతో పాటు, వాహనాలకు బ్రేకులు ఫెయిల్ చేసి ప్రమాదానికి గురిచేస్తామని బెదిరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న ఇందల్వాయి పోలీసులు తిరుమన్ పల్లి ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకుండా ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ నుగుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలని, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునే క్రమంలో తమను బెదిరిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందల్వాయి మండలంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చేపట్టిన ఈ చర్యలపై స్థానికంగా చర్చ జరుగుతుందని స్థానికులు తెలిపారు



# చెరువులో పడి వ్యక్తి గల్లంతు ఆచూకీ తెలిసి రాలేదు





**గన్నారం శివారులో గేదెలను మేపుతుండగా ప్రమాదం**

**ఇందల్వాయి( ప్రజా జ్యోతి )** సెప్టెంబర్. 16 ఇందల్వాయి: మండల కేంద్రంలోని గన్నారం శివారులో ఓ వ్యక్తి చెరువులో పడి గల్లంతయ్యాడు. మేఘ్య నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధికి చెందిన కె. మంగ్య రోజువారీగా గన్నారం గ్రామానికి చెందిన గేదెలను తన కుమారుడితో కలిసి మేపేవాడు.రోజువారీ మాదిరిగానే ఈరోజు కూడా తండ్రి, కొడుకులు గేదెలను చెరువుగట్టుకు తోలుకెళ్లారు. గేదెలు చెరువు మధ్యలోకి వెళ్తుండటంతో వాటిని పక్కకు తోలేందుకు మంగ్య ప్రయత్నించాడు. ఈ క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయాడు.మంగ్య కుమారుడు వెంటనే నీటిలోకి వెళ్లి తండ్రి చేతులు పట్టుకుని బయటకు లాగేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో చుట్టుపక్కల వారికి కేకలు వేసి సమాచారం అందించాడు. స్థానికులు అక్కడికి చేరుకుని చూడగా మంగ్య నీటిలోకి వెళ్లిపోయినట్లు తెలిపారు.సమాచారం అందుకున్న ఫైర్‌స్టేషన్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని గుమిగూడిన ప్రజలను అదుపు చేశారు. అయితే ఇప్పటివరకు మంగ్య ఆచూకీ లభించలేదు. అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు.

## తీవ్రరూపం అవుతున్న 22ఏ

**హైదరాబాద్ :** తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

## పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య

**హైదరాబాద్ :** కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు.హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు.పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు.రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ

## మద్యం మత్తు.. అతివేగం..
## యువకుడి ప్రాణం బలి

**ప్రజాజ్యోతి భీంగల్:**మద్యం సేవించి నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడపడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై భీంగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పురాణిపేటకు చెందిన తీగల అక్షయ్ (23) సెప్టెంబర్ 14న రాత్రి తన స్నేహితుడు స్వరాజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నాడు. బాబాపూర్ వైపు వెళ్తున్న సమయంలో స్వరాజ్ మద్యం మత్తులో వాహనాన్ని అతివేగంగా నడపడంతో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వెనుక కూర్చున్న అక్షయ్‌కు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి నర్సగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహనం నడిపిన స్వరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై భీంగల్ సీఐ పి. సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా, వేగాన్ని నియంత్రిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.




# వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం...




**ప్రజా జ్యోతి.బోధన్ సెప్టెంబర్ 15..** వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో సార్వజనిక్ ఆధ్వర్యంలో సోమవారం వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సార్వజనిక్ అధ్యక్షుడు పూజారి లింగం, ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటనారాయణ కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర మిల్క్ డైరీ యజమాని మానుకొండ శ్రీకాంత్ రెడ్డి దంపతులు వినాయకునికి ప్రత్యేకపూజలు..




**ప్రజా జ్యోతి బోధన్ సెప్టెంబర్ 15..** బోధన్ పట్టణంలోని ఆచన్పల్లి ఒకటో వార్డులో శ్రీ వెంకటేశ్వర మిల్క్ డైరీ యజమాని శ్రీకాంత్ రెడ్డి దంపతులు వినాయకునికి కుమారుడు కుమార్తె మొదటిరోజు ప్రత్యేక పూజలు చేశారు అలాగే వారి తల్లిదండ్రి కూడా వినాయకుని పూజలో పాల్గొన్నారు వినాయకుడు ఎప్పుడు మమ్మల్ని మా కుటుంబాన్ని ఎల్లవేళలా చల్లగా చూడాలని అతనికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రత్యేక పూజలో ఆచన్ పల్లి ఒకటవవార్డు కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి మరియు వజ్రాల రామకృష్ణ అభిలాష్ సాంబిరెడ్డి ఆచన్ పల్లి గ్రామస్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనీ. అనంతరం స్వీటు నైవేద్యం పులిహోర ప్రసాదంగా స్వీకరించడం జరిగింది

# పర్యావరణ పరిరక్షణ కోసం..

**ధర్పల్లి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 15**
పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ధర్పల్లి గ్రామానికి చెందిన కావేటి నరేందర్ సోషల్ మీడియా వేదికగా ప్రచారం నిర్వహించారు ఇందులో భాగంగా వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని తాను మట్టి గణపతిని ప్రతిష్టించినట్లు తెలిపారు పండితుల సూచనల మేరకు మట్టి గణపతికి చెక్క పీట పసుపు వస్త్రము కుంకుమ గంధము కలుషం రాగి చెంబు బియ్యం అక్షింతలు టేకు పువ్వులు గరిక తమలపాకులు మామిడి ఆకులు ప్రకృతి సహజ సిద్ధమైన వాటితో గణపయ్యను అలంకరించినట్లు తెలిపారు భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణానికి హాని కలిగించకుండా ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు



# బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని మంత్రి సీతక్కకు వినతి

**- ఉప సర్పంచ్ ఫోరం జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ మూడ్ దయానంద్**

**ప్రజాజ్యోతి, ఏర్గట్ల పొన్కల్** నుంచి ఏర్గట్ల మండలం, ఇబ్రహీంపట్నం, మెండోరా మండలాల మీదుగా మోర్తాడ్, ఆర్మూర్ మార్గంలో హైదరాబాద్ జేబీఎస్ బస్టాండ్ వరకు గతంలో ఉన్న బస్సు సౌకర్యాన్ని మళ్లీ పునరుద్ధరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఈ బస్సు సౌకర్యం పునరుద్ధరిస్తే ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వైద్య సేవల కోసం హైదరాబాద్, ఆర్మూర్, మోర్తాడ్ తదితర ప్రాంతాలకు వెళ్లే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని వినతిలో పేర్కొన్నారు. ముఖ్యంగా దవాఖానలకు వెళ్లే రోగులు, విద్యార్థులు, నిత్య ప్రయాణికులు ఇతర రవాణా సౌకర్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుందని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పొన్కల్--హైదరాబాద్ బస్సు సౌకర్యాన్ని తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దయానంద్, ఉపసర్పంచ్ ఫోరమ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రజల తరఫున బస్సు సౌకర్యం పునరుద్ధరణకు కృషి చేయాలని మంత్రిని కోరారు.

